12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు
విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టీ. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు
విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టీ. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

సంపుటి : 2 సంచిక : 41 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు గురువారం 15 అక్టోబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :2 ISSUE :41 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE THU 15 OCTOBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## జనసేనలో చేరిన వంగవీటి రాధా..

### విజయవాడ మేయర్ రేసులో ఉంటారా?



- కండువా కప్పి ఆహ్వానించిన పవన్ కల్యాణ్
- విజయవాడ మేయర్ రేసులో రాధా పేరు
- జనసేనలో చేరిన తిరుపతికి చెందిన ప్రణీత్ ప్రమోద్
- విజయవాడలో 35 డివిజన్లు జనసేన కోరుతున్నట్లు సమాచారం
- కూటమి సీట్ల సర్దుబాటుపై కొనసాగుతున్న చర్చలు

పెన్ పవర్ డెస్క్:మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ జనసేన పార్టీలో చేరారు. బుధవారం అమరావతిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. తిరుపతికి చెందిన ప్రణీత్ ప్రమోద్ కూడా జనసేనలో చేరారు.

- మిగతా 2లో




**ఆంధ్రప్రదేశ్‌లో ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ చంద్ర పుణేఠా బుధవారం విజయవాడలో ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, జడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రామ పంచాయతీలకు మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఆయన ప్రకటించారు.**

పెన్ పవర్ డెస్క్: ఈ ప్రకటనతో రాష్ట్రవ్యాప్తంగా తక్షణమే ఎన్నికల ప్రవర్తనా నియమావళి (కోడ్) అమల్లోకి వచ్చింది.తొలి విడతలో భాగంగా 100 పట్టణ స్థానిక సంస్థలకు (ఖూదీ) ఎన్నికలు జరగనున్నాయి. వీటిలో 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 77 మున్సిపాలిటీలు, 10 నగర పంచాయతీలు ఉన్నాయి. ఈ నెల 16 నుంచి 18 వరకు నామినేషన్లు స్వీకరించనుండగా, 19న పరిశీలన, 21న నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఇచ్చారు. అక్టోబర్ 28న పోలింగ్ నిర్వహించి, 30న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటిస్తారు.రెండో విడతలో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. నవంబర్ 3న పోలింగ్, 5న ఫలితాలు వెల్లడిస్తారు. ఇక మూడో విడతలో గ్రామ పంచాయతీలకు మూడు దశల్లో ఎన్నికలు నిర్వహిస్తారు. నవంబర్ 26, 29, డిసెంబర్ 2 తేదీల్లో పోలింగ్, లెక్కింపు ప్రక్రియ పూర్తి చేస్తారు. రిజర్వేషన్లపై న్యాయపరమైన చిక్కుముడులు వీడి, ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్లు జారీ చేయడంతో ఎన్నికల ప్రక్రియకు మార్గం సుగమమైంది.





### బెజవాడ దుర్గమ్మను దర్శించుకున్న

## రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

- విజయవాడ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము
- నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు
- గన్నవరం విమానాశ్రయంలో రాష్ట్రపతికి ఘన స్వాగతం పలికిన ప్రముఖులు
- ఆలయంలో వేద పండితుల ఆశీర్వచనాలు అందుకున్న రాష్ట్రపతి
- దర్శనం కోసం వేచి ఉన్న భక్తులను ఆప్యాయంగా పలకరించిన ముర్ము

పెన్ పవర్ డెస్క్:రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము బుధవారం విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్న వేళ ఆమె అమ్మవారి సన్నిధికి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పర్యటన కోసం ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్రపతికి ఘన స్వాగతం లభించింది. రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు కమలేశ్ పాశ్వాన్, డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత, ఎంపీ వల్లభనేని బాలశౌరి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితరులు ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం ఇంద్రకీలాద్రికి చేరుకున్న రాష్ట్రపతికి ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. రాష్ట్ర హోంమంత్రి అనిత, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, ఆలయ ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో షీనా నాయక్ ఆమెను ఆలయంలోకి ఆహ్వానించారు. గర్భాలయంలో

- మిగతా 2లో



### విజయనగరం జడ్పీ రేసులో

## బొత్స సత్యనారాయణ కూతురు అనూష?

- టీడీపీలోకి వెళ్లిన మేనల్లుడు చిన్న శ్రీనుకు చెక్ పెట్టే వ్యూహం
- బీసీ మహిళకు రిజర్వ్ కావడంతో మారిన సమీకరణాలు
- చిన్న శ్రీను కూడా తన కుమార్తెను బరిలోకి దించనున్నట్లు ప్రచారం

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో విజయనగరం జిల్లా రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. ముఖ్యంగా జెడ్పీ చైర్‌పర్సన్ పీఠం కోసం వైసీపీ కొత్త వ్యూహానికి పదును పెడుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవలే వైసీపీని వీడి టీడీపీలో చేరిన తన మేనల్లుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను)కి రాజకీయంగా చెక్ పెట్టేందుకు,

- మిగతా 2లో

## ప్రజాబలంపై కాదు..

## పోలీసు బలంపై ఆధారపడ్డారు

- స్థానిక ఎన్నికల్లో ప్రభుత్వం పోలీసులను వాడుకుంటోందని కన్నబాబు ఆరోపణ
- కులధ్రువీకరణ పత్రాలు ఇవ్వకుండా అభ్యర్థులను అడ్డుకుంటున్నారని విమర్శ
- వైసీపీ కార్యకర్తలపై పాత కేసులు పెట్టి వేధిస్తున్నారని మండిపాటు

- మిగతా 2లో



### జగన్ అక్రమాస్తుల కేసులపై కీలక పరిణామం..

## ఇక రోజువారీ విచారణ

- జగన్ ఈడీ కేసులపైనా ఇక రోజువారీ విచారణ
- విచారణ వేగవంతం చేయాలని సీబీఐ కోర్టు నిర్ణయం
- జగన్‌తో పాటు 70 మంది నిందితుల వ్యక్తిగత విచారణ
- పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న 9 ఈడీ ఛార్జిషీట్లు

పెన్ పవర్ డెస్క్:మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి సంబంధించిన అక్రమాస్తుల కేసుల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆయనపై ఉన్న సీబీఐ కేసులతో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్

- మిగతా 2లో



## ఢిల్లీలో అక్టోబర్ 16న ‘తిరంగా’ నిరసన..

### కొత్త ఆందోళనకు అభిజీత్ దీప్కే పిలుపు

- సాయంత్రం 5 గంటలకు సెంట్రల్ పార్క్‌లో కార్యక్రమం
- నిరసనకు ‘లెహ్రా దో తిరంగా’ పేరు
- సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాల అరెస్టుకు నిరసనగా కార్యక్రమం
- అజింక్య షిండే వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల
- స్థానికంగా తిరంగా మార్చ్‌లు నిర్వహించాలని దీప్కే పిలుపు



పెన్ పవర్ డెస్క్:తమ పార్టీ సహ కన్వీనర్లు సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాలను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ అక్టోబర్ 16న ఢిల్లీలోని కన్నాట్ ప్లేస్‌లో త్రివర్ణ పతాక

- మిగతా 2లో



### జర్మనీలో ఘోర అగ్నిప్రమాదం..

## ముగ్గురు భారతీయుల సజీవ దహనం

- జర్మనీలోని బోచుమ్ నగరంలో ఘోర అగ్నిప్రమాదం
- ఘటనలో ముగ్గురు భారతీయులు మృతి
- మృతుల్లో ఇద్దరు యువతులు, ఒక యువకుడు
- ఐదుగురికి గాయాలు, ఆసుపత్రికి తరలింపు
- హత్య అనుమానంతో ఓ వ్యక్తిని అరెస్ట్ చేసిన పోలీసులు

పెన్ పవర్ డెస్క్:జర్మనీలో జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో ముగ్గురు భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. బోచుమ్ నగరంలోని

- మిగతా 2లో

## పాక్ సహా 31 దేశాల పైలట్లపై ‘ఎయిర్ ఫ్రాన్స్’ నిషేధం

- ఇజ్రాయెల్ వెళ్లే విమానాల్లో 31 దేశాల సిబ్బందిపై నిషేధం
- ఇజ్రాయెల్ నిబంధనలను పాటిస్తున్నట్లు ప్రకటించిన ఎయిర్ ఫ్రాన్స్
- ఫ్లైదుబాయ్ విమానం హైజాక్ యత్నం తర్వాత కఠిన నిర్ణయం
- ఈ నిర్ణయం ఫ్రెంచ్ ఉపాధి చట్టాలకు విరుద్ధమంటూ ఆందోళనలు

- మిగతా 2లో






### భారత్ ఎదుగుదలను మేమే

## పరిమితం చేసుకోలేం

పెన్ పవర్ డెస్క్:భారత్‌ను ‘మధ్యస్థాయి శక్తి’ అని పిలవడం సరికాదని, ఆ నిర్వచనంతో దేశాన్ని పరిమితం చేసినట్లు అవుతుందని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు. తాము మధ్యస్థ శక్తి కాదని, ‘మధ్యలో ఉన్న శక్తి’ అని ఆయన వ్యాఖ్యానించారు. బుధవారం ‘బ్లూమ్‌బెర్గ్ న్యూ ఎకానమీ

- మిగతా 2లో

## భారత్‌తో సంబంధాలు మళ్లీ గాడిన పడుతున్నాయి

### కెనడా విదేశాంగ మంత్రి



- నిజ్జర్ హత్య తర్వాత భారత్‌తో సంబంధాలు మెరుగుపడ్డాయన్న మంత్రి
- ఖలిస్థానీ నినాదాలపై సమతుల్యం పాటించాల్సి ఉందన్న అనితా ఆనంద్
- బిష్ణోయ్ గ్యాంగ్‌ను ఉగ్రవాద సంస్థగా గుర్తించిన కెనడా ప్రభుత్వం
- డిసెంబర్‌లో కెనడాలో ప్రధాని మోదీ పర్యటించే అవకాశం

- మిగతా 2లో

# ఎడిటర్ వ్యూ

## పరిమితి పాతాళంలో.. ఖర్చు ఆకాశంలో..
## పొంతన లేని ఎన్నికల ఖర్చులు

రాష్ట్రంలో స్థానిక ఎన్నికల వాతావరణం అలుముకుంది. నోటిఫికేషన్ విడుదలకు ముందు ఎన్నికల కమిషన్ ఒక్కొక్క పని చక్కబెడుతోంది. ఇప్పటికే మున్సిపల్ ఎన్నికల రిజర్వేషన్ ప్రక్రియ పూర్తి చేయగా, జడ్పీ, మండలాలు, పంచాయతీలకు ఈ రోజు సాయంత్రం కల్లా రిజర్వేషన్లు ఖరారు కానున్నాయని అంటున్నారు. ఇక ఎన్నికల్లో అభ్యర్థుల ఖర్చులపై పరిమితి విధిస్తూ ఎన్నికల సంఘం తాజాగా ఆదేశాలు జారీ చేసింది. అయితే ఎన్నికల సంఘం విధించే పరిమితులకు వాస్తవంగా అయ్యే ఖర్చుకు ఎక్కడా పొంతన ఉండటం లేదని చెబుతున్నారు. ఎన్నికలు అంటేనే ధన బలం ఎక్కువగా చూపాల్సి వుంటుందని అంటున్నారు. ఎన్నికలలో డబ్బు దుర్వినియోగం కాకుండా, ప్రలోభాలకు అవకాశం ఇవ్వకుండా ఎన్నికల సంఘం నిఘా వేసిన అదంతా తూతూ మంత్రంగానే ఉంటుందని వ్యాఖ్యానిస్తున్నారు. స్థానిక ఎన్నికల్లో అభ్యర్థుల ఖర్చులపై పరిమితులు ఆసక్తి రేపుతున్నాయి. పది వేల జనాభా ఉన్న గ్రామాల్లో సర్పంచులు రూ.2.5 లక్షలు, వార్డు సభ్యులు రూ.50 వేలు ఖర్చు చేయాల్సివుంటుందని అంటున్నారు. అదే సమయంలో పది వేల కన్నా ఎక్కువ జనాభా ఉండే పంచాయతీల్లో సర్పంచులు రూ.4 లక్షలు, వార్డు సభ్యులు లక్ష చొప్పున ఖర్చు చేసుకోవచ్చునని ఎన్నికల సంఘం సూచించింది. అదే సమయంలో జడ్పీటీసీ అభ్యర్థులు రూ.8 లక్షలు, ఎంపీటీసీ అభ్యర్థులు రూ.4 లక్షలు, మున్సిపల్ చైర్మన్ అభ్యర్థులు రూ.20 లక్షలు, కౌన్సిలర్లు రూ.7.5 లక్షలు, విశాఖ కార్పొరేషన్ మేయర్ అభ్యర్థి 40 లక్షలు, ఇతర కార్పొరేషన్లలో మేయర్ అభ్యర్థులు 25 లక్షలు, కార్పొరేటర్లు విశాఖలో రూ20 లక్షలు, ఇతర ప్రాంతాల్లో రూ.10 లక్షల చొప్పున ఖర్చు చేయాల్సివుంటుంది. అయితే ఎన్నికల సంఘం విధించిన ఈ పరిమితి ఏమూలకూ చాలదని, నామినేషన్ వేయడానికి ముందే ఈ ఖర్చులు అయ్యే పరిస్థితి ఉందని అంటున్నారు. ఎన్నికలు అంటేనే ధన ప్రవాహం ఎక్కువగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రతి పనికి డబ్బు ఖర్చు చేయాల్సివుండటం, డబ్బు పెట్టకపోతే కనీసం ఒక్క కార్యకర్త కూడా పలికే అవకాశం లేకపోవడంతో పోటీ చేసే అభ్యర్థులు భారీగా వెచ్చించాల్సివుంటుందని అంటున్నారు. నామినేషన్ వేసేటప్పుడు జన సమీకరణ నుంచి వారికి భోజనాలు, మద్యం పంపిణీతో కలుపుకుంటే తొలిరోజే మున్సిపల్ కార్పొరేషన్లలో కోట్లలో ఖర్చు చేయాల్సివుంటుందని అంటున్నారు. కనీసం ప్రతి కార్యకర్తకు రూ.500 నుంచి ఇచ్చుకోవాల్సివుంటుందని అంటున్నారు. ఇక ఎన్నికల ముగిసే వరకు కార్యకర్తలను ప్రసన్నం చేసుకోడానికి ఓటరు దేవుడిని ఆకట్టుకోడానికి డబ్బులు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉందని అంటున్నారు. గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ లో రూ.40 లక్షల వరకు ఖర్చు చేయొచ్చని ఎన్నికల సంఘం పరిమితి విధించగా, ఇక్కడ దాదాపు 40 కోట్ల కంటే ఎక్కువే ఖర్చు అయ్యే అవకాశం ఉందని అంటున్నారు. అదేవిధంగా విజయవాడ, రాజమండ్రి, కాకినాడ, కడప, కర్నూలు వంటి నగరాల్లోనూ ఖర్చు కోట్లపైనే ఉంటుందని అంటున్నారు. మేయర్, చైర్మన్ అభ్యర్థులను ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నుకోవడం వల్ల డబ్బు మరింత ఖర్చు పెట్టాల్సివుంటోందని అంటున్నారు. గతంలో ఈ పదవులకు పరోక్ష విధానంలో ఎన్నికలు జరిగేవని, దీనివల్ల కౌన్సిలర్ అభ్యర్థులు స్థానికంగా మేనేజ్ చేసుకుని కాస్త తక్కువ ఖర్చుతో బయటపడేవారని చెబుతున్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఈ సారి ప్రత్యక్ష విధానంలో ఎన్నికలు నిర్వహించడం వల్ల మేయర్, చైర్మన్ పదవులకు ప్రతిష్ఠ పెరిగిందని, ఐదేళ్లు పదవిలో ఉండే అవకాశం ఉండటం వల్ల అభ్యర్థులు కూడా తమ వ్యక్తిగత పరువు ప్రతిష్టల కోసం ఎక్కువ ఖర్చు పెట్టే అవకాశం ఉందని అంటున్నారు.

## బెజవాడ దుర్గమ్మను దర్శించుకున్న
## రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

- మొదటి పేజి తరువాయి

అమ్మవారిని దర్శించుకున్న అనంతరం, వేద పండితులు రాష్ట్రపతికి వేదాశీర్వచనాలు అందించారు. ఆలయ అధికారులు ఆమెకు పట్టువస్త్రాలు, అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా దర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులను రాష్ట్రపతి ఆప్యాయంగా పలకరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటూ ఆమె ముందుకు సాగారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో అధికారులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

# జనసేనలో చేరిన వంగవీటి రాధా..

- మొదటి పేజి తరువాయి

ఈ పరిణామంతో విజయవాడ మేయర్ అభ్యర్థిగా రాధాకృష్ణ పేరు తెరపైకి వచ్చింది. విజయవాడ మేయర్ పదవికి రాధాకృష్ణ పోటీ చేసే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే, మేయర్ సీటును కూటమిలో జనసేనకు కేటాయిస్తారా? అన్నది ఇంకా స్పష్టం కాలేదు. గత సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి రాధాకృష్ణ కృషి చేశారు. వైసీపీ నుంచి బయటకు వచ్చిన తర్వాత టీడీపీతో కలిసి పనిచేస్తూ వచ్చారు. ఇప్పుడు జనసేనలో చేరడంతో ఆయన రాజకీయ భవిష్యత్తుపై ఆసక్తి నెలకొంది. మరోవైపు, స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ప్రకటించారు. మేయర్లు, మున్సిపల్ ఛైర్‌పర్సన్లు, జడ్పీ ఛైర్మన్ల పదవులకు రిజర్వేషన్లను ఖరారు చేస్తూ ప్రభుత్వం ఇప్పటికే గెజిట్‌లు విడుదల చేసింది. ఈ తరుణంలో రాధా చేరికకు ప్రాధాన్యం ఏర్పడింది. స్థానిక ఎన్నికల్లో సీట్ల సర్దుబాటుపై కూటమి నేతలు చర్చలు జరుపుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో జనసేన నేతలు నాదెండ్ల మనోహర్, లింగమనేని రమేశ్, హరిప్రసాద్ సమావేశమయ్యారు. విజయవాడలోని 86 డివిజన్లలో 35 స్థానాలు తమకు కేటాయించాలని జనసేన కోరుతున్నట్లు సమాచారం. అయితే, 15 స్థానాలు ఇచ్చేందుకు టీడీపీ సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. సీట్ల పంపకాలపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది.

# ప్రజాబలంపై కాదు..
## పోలీసు బలంపై ఆధారపడ్డారు

ఆంధ్రప్రదేశ్‌లో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం ప్రజాబలంపై కాకుండా పోలీసుల శక్తిపై ఆధారపడిందని వైసీపీ ఆరోపించింది. వైసీపీ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకునేందుకు అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆ పార్టీ నేతలు ఆరోపించారు. తాడేపల్లిలో మీడియాతో మాట్లాడిన మాజీ మంత్రి కురసాల కన్నబాబు ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "ప్రజాబలం లేకే చంద్రబాబు ప్రభుత్వం పోలీసులను అడ్డం పెట్టుకుని ఎన్నికల్లో గెలవాలని చూస్తోంది. వైసీపీ తరపున పోటీ చేయాలనుకుంటున్న వారిని బెదిరిస్తున్నారు. పాత కేసులు తిరగదోడి, బైండోవర్ల పేరుతో ఉదయం నుంచి రాత్రి వరకు పోలీస్ స్టేషన్లలో కూర్చోబెట్టి వేధిస్తున్నారు. కులధ్రువీకరణ పత్రాలు ఇవ్వడంలో కావాలనే జాప్యం చేస్తున్నారు" అని ఆరోపించారు. క్వాంటం కంప్యూటింగ్ గురించి మాట్లాడే ప్రభుత్వం, క్యాస్ట్ సర్టిఫికెట్లు ఇచ్చేందుకు ఒక యాప్‌ను సరిగా నడపలేకపోతోందా అని ఆయన ప్రశ్నించారు. 24 గంటల్లో మాన్యువల్‌గా సర్టిఫికెట్లు అందించాలని డిమాండ్ చేశారు.

పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియను పూర్తిగా వెబ్‌కాస్టింగ్ చేయాలని, సున్నితమైన ప్రాంతాల్లో కేంద్ర బలగాలను మోహరించాలని కన్నబాబు డిమాండ్ చేశారు. వార్డుల పునర్విభజన, రిజర్వేషన్ల కేటాయింపులోనూ అవకతవకలు జరిగాయని, ఇవి ప్రజల సౌలభ్యం కోసం కాకుండా అధికార పార్టీకి అనుకూలంగా జరిగాయని ఆరోపించారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా, జగన్ నాయకత్వంలో ప్రతి వార్డులోనూ పోటీ చేసి గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు.

# విజయనగరం జడ్పీ రేసులో బొత్స సత్యనారాయణ కూతురు అనూష?

- మొదటి పేజి తరువాయి

సీనియర్ నేత బొత్స సత్యనారాయణ తన కుమార్తె బొత్స అనూషను రంగంలోకి దించాలని యోచిస్తున్నట్లు పార్టీ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. విజయనగరం జెడ్పీ చైర్‌పర్సన్ పదవిని ఈసారి బీసీ (మహిళ)కు రిజర్వ్ చేశారు. ఇదే ఇప్పుడు రాజకీయ సమీకరణాలకు కేంద్ర బిందువుగా మారింది. గతంలో వైసీపీ తరపున జెడ్పీ చైర్మన్‌గా ఉన్న చిన్న శ్రీను, ఇప్పుడు టీడీపీ కూటమి తరఫున తన కుమార్తె సిరి సహస్రను బరిలోకి దించాలని భావిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో చిన్న శ్రీను దూకుడుకు కళ్లెం వేయాలంటే, బొత్స కుటుంబం నుంచే బలమైన అభ్యర్థిని నిలబెట్టాలని వైసీపీ నాయకత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా వృత్తిరీత్యా డాక్టర్ అయిన బొత్స అనూషను చైర్‌పర్సన్ అభ్యర్థిగా ప్రకటించే అవకాశాలు ఉన్నాయని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి.

ప్రస్తుతం బొత్స అనూష భీమిలి అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్తగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఒకవేళ పార్టీ అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇస్తే, ఆమె విజయనగరం జెడ్పీ చైర్‌పర్సన్ బరిలో నిలవడం ఖాయమని చెబుతున్నారు. ఇదే జరిగితే విజయనగరం జెడ్పీ ఎన్నికల పోరు, బొత్స కుటుంబ సభ్యుల మధ్య ప్రత్యక్ష పోరుగా మారి రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తించడం ఖాయం.

# ఢిల్లీలో అక్టోబర్ 16న 'తిరంగా' నిరసన..

- మొదటి పేజి తరువాయి

ప్రదర్శన నిర్వహించనున్నట్లు కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ప్రకటించారు. దేశభక్తులంతా జాతీయ జెండాలతో సెంట్రల్ పార్క్‌కు రావాలని పిలుపునిచ్చారు. సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో విడుదల చేసిన వీడియో సందేశంలో ఈ నిరసనకు 'లెహ్రావో దో తిరంగా' అని పేరు పెట్టినట్లు దీప్కే తెలిపారు. కేవలం త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శించినందుకే సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాలను జైలుకు పంపారని ఆయన ఆరోపించారు. అక్టోబర్ 16న సాయంత్రం 5 గంటలకు కన్నాట్ ప్లేస్‌లోని సెంట్రల్ పార్క్‌కు జాతీయ జెండాలతో చేరుకోవాలని కోరారు. త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయడం నేరం కాదని ఈ కార్యక్రమం ద్వారా చాటిచెబుతామని అన్నారు. ఢిల్లీకి రాలేని వారు తమ ప్రాంతాల్లో తిరంగా మార్చ్‌లు నిర్వహించాలని దీప్కే విజ్ఞప్తి చేశారు. జాతీయ జెండా తమ గర్వకారణమని, దాన్ని ప్రదర్శించడం నేరం కాదనే సందేశాన్ని అందించాలని కోరారు. ఈ నిరసన తర్వాత తనను కూడా అరెస్టు చేసే అవకాశం ఉందని, అయినా ఆందోళన చెందడం లేదని చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లోనూ త్రివర్ణ పతాకాన్ని ప్రదర్శిస్తానని స్పష్టం చేశారు.

### ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీ

మరోవైపు, జంతర్ మంతర్‌లోకి అక్రమంగా ప్రవేశించిన కేసులో సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాలకు బుధవారం ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించారు. సీజేపీకి చెందిన మరో నేత అజింక్య షిండే వ్యక్తిగత పూచీకత్తుపై విడుదలయ్యారు. దాస్‌ను తీహార్ జైలులోని రెండో నంబర్ జైలులో, రంకాను నాలుగో నంబర్ జైలులో వేర్వేరుగా ఉంచినట్లు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వర్గాలు తెలిపాయి. ముగ్గురు సీజేపీ సభ్యులను జంతర్ మంతర్‌లోకి చొరబడినందుకు ముందస్తు నిర్బంధంలోకి తీసుకున్నారు. జంతర్ మంతర్‌ను నిరసనలకు కేటాయించిన అధికారిక ప్రదేశాల జాబితా నుంచి తొలగించిన నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నట్లు సమాచారం.

# జర్మనీలో ఘోర అగ్నిప్రమాదం.. ముగ్గురు భారతీయుల సజీవ దహనం

- మొదటి పేజి తరువాయి

ఓ నివాస భవనంలో చోటుచేసుకున్న ఈ విషాద ఘటనలో మరో ఐదుగురు గాయపడ్డారు. ఈ సంఘటనపై హత్య అనుమానంతో పోలీసులు ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. స్థానిక మీడియా కథనాల ప్రకారం.. బోచుమ్‌లోని హోఫ్‌స్టెడ్ జిల్లాలో ఉన్న ఓ నివాస భవనంలో మంగళవారం తెల్లవారుజామున మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అనంతరం భవనంలోని రెండో అంతస్తులో ఉన్న ఓ అపార్ట్‌మెంట్‌లో ముగ్గురి మృతదేహాలను గుర్తించారు. మృతులను 25, 27 ఏళ్ల వయసున్న ఇద్దరు యువతులుగా, 26 ఏళ్ల యువకుడిగా గుర్తించారు. వీరంతా భారతీయులని అధికారులు నిర్ధారించారు. ఈ ప్రమాదంలో పొగ పీల్చడం వల్ల తీవ్ర అస్వస్థతకు గురైన మరో ఐదుగురిని చికిత్స కోసం స్థానిక ఆసుపత్రులకు తరలించారు. ప్రస్తుతం వారికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. అయితే గాయపడిన వారి జాతీయతకు సంబంధించిన వివరాలు తెలియరాలేదు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ప్రాథమిక విచారణ అనంతరం అదే భవనంలో నివసించే 41 ఏళ్ల రొమేనియా దేశస్థుడిని హత్య అనుమానంతో అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ అగ్నిప్రమాదం ప్రమాదవశాత్తు జరిగిందా లేక ఎవరైనా ఉద్దేశపూర్వకంగా చేశారా అనే కోణంలో విచారణ కొనసాగుతోంది.

## జగన్ అక్రమాస్తుల కేసులపై కీలక పరిణామం..
# ఇక రోజువారీ విచారణ

- మొదటి పేజి తరువాయి

(ఈడీ) కేసులను కూడా రోజువారీగా విచారించాలని సీబీఐ కోర్టు నిర్ణయించింది. ఈ నిర్ణయంతో పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న కేసుల విచారణ వేగవంతం కానుంది. ఈ కేసుల్లో జగన్‌తో పాటు మరో 70 మంది నిందితులను వ్యక్తిగతంగా విచారించాలని న్యాయస్థానం నిర్ణయం తీసుకుంది. జగన్‌పై దాదాపు దశాబ్దకాలంగా 9 ఈడీ ఛార్జిషీట్లు న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్నాయి. వీటిపై విచారణను వేగవంతం చేయాలని కోరుతూ ఈడీ అధికారులు ఇప్పటికే తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. సీబీఐ కోర్టులో నిందితులు దాఖలు చేసుకున్న డిశ్చార్జ్ పిటిషన్లపై తీర్పులు రాకపోవడంతో కేసుల విచారణ ముందుకు సాగడం లేదని ఈడీ తన పిటిషన్‌లో పేర్కొంది. ఈడీతో పాటు మాజీ మంత్రి హరిరామజోగయ్య, మరికొందరు కూడా విచారణను వేగవంతం చేయాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో సీబీఐ కోర్టు తీసుకున్న తాజా నిర్ణయంతో జగన్‌పై ఉన్న కేసుల విచారణ ఇకపై వేగంగా ముందుకు సాగే అవకాశం కనిపిస్తోంది.

# భారత్‌తో సంబంధాలు మళ్లీ గాడిన పడుతున్నాయి

ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య తర్వాత తీవ్రంగా దెబ్బతిన్న భారత్–కెనడా ద్వైపాక్షిక సంబంధాలు ఇప్పుడు మళ్లీ గాడిన పడుతున్నాయని, క్రమంగా బలపడుతున్నాయని కెనడా విదేశాంగ మంత్రి అనితా ఆనంద్ అన్నారు. ఓ టీవీ ఛానల్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ, ఇరు దేశాల మధ్య సంబంధాలలో చోటుచేసుకుంటున్న ఈ మార్పును ఆమె ఒక "ఆహ్వానించదగ్గ పరిణామం"గా అభివర్ణించారు.

వాణిజ్యం, పర్యాటకం, విద్య వంటి రంగాల్లో ఇరు దేశాల ప్రజల మధ్య సంబంధాలు చాలా లోతుగా, బలంగా ఉన్నాయని ఆనంద్ తెలిపారు. రాబోయే దశాబ్దంలో అమెరికాయేతర దేశాలతో వాణిజ్యాన్ని రెట్టింపు చేసుకోవాలని కెనడా లక్ష్యంగా పెట్టుకుందని, ఈ నేపథ్యంలో 4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, ప్రపంచంలో ఆరవ అతిపెద్ద శక్తిగా ఉన్న భారత్ తమకు ఎంతో ముఖ్యమని ఆమె నొక్కిచెప్పారు. నిజ్జర్ హత్య ఉదంతంపై మాట్లాడుతూ.. కెనడా గడ్డపై ఒక కెనడా పౌరుడి హత్యకు సంబంధించిన కేసులో న్యాయపరమైన విచారణ కొనసాగుతోందని ఆమె స్పష్టం చేశారు. చట్టబద్ధ పాలన, దేశీయ భద్రతకు తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. భారత ప్రభుత్వంతో చర్చల్లో గణనీయమైన పురోగతి సాధించామని, ఇందులో భాగంగానే 'బిష్ణోయ్ గ్యాంగ్'ను ఉగ్రవాద సంస్థగా గుర్తించామని వెల్లడించారు. కెనడాలో నిరసనల సందర్భంగా ఖలిస్థాన్ అనుకూల నినాదాలు, ఇందిరా గాంధీ హత్యను ప్రస్తావించడం వంటి ఘటనలపై అడిగిన ప్రశ్నకు.. కెనడాలో భావప్రకటనా స్వేచ్ఛకు, ప్రజా భద్రతకు మధ్య సమతుల్యం పాటించాల్సిన అవసరం ఉందని బదులిచ్చారు. ఈ అంశాన్ని దేశ ప్రజా భద్రత, న్యాయశాఖ మంత్రులు పర్యవేక్షిస్తున్నారని, తన దృష్టి అంతా విదేశీ సంబంధాలపైనే ఉందని ఆమె వివరించారు.

కెనడా ప్రధాని మార్క్ కార్నీ, భారత ప్రధాని నరేంద్ర మోదీతో తన సంబంధానికి ఎంతో విలువ ఇస్తారని అనితా ఆనంద్ చెప్పారు. ఈ ఏడాది డిసెంబర్‌లో కెనడా పర్యటనకు రానున్న ప్రధాని మోదీకి స్వాగతం పలికేందుకు తాము ఎదురుచూస్తున్నామని ఆమె వెల్లడించారు. ఇప్పటికే ఇరు దేశాల రాయబార కార్యాలయాలను బలోపేతం చేశామని, ఇరు దేశాల నేతలు క్రమం తప్పకుండా సమావేశమవుతూ సంబంధాలను మెరుగుపరుస్తున్నారని గుర్తుచేశారు.

## పాక్ సహా 31 దేశాల పైలట్లపై 'ఎయిర్ ఫ్రాన్స్' నిషేధం

ఇజ్రాయెల్‌కు వెళ్లే తమ విమానాల్లో పనిచేసే సిబ్బంది విషయంలో ప్రభుత్వం విధించిన కొత్త నిబంధనలను పాటించనున్నట్లు ప్రముఖ విమానయాన సంస్థ ఎయిర్ ఫ్రాన్స్ ధృవీకరించింది. ఇజ్రాయెల్‌తో దౌత్య సంబంధాలు లేని పాకిస్థాన్ సహా 31 దేశాలకు చెందిన పైలట్లు, క్యాబిన్ సిబ్బందిని తమ దేశంలోకి అనుమతించబోమని ఇజ్రాయెల్ స్పష్టం చేసింది. ఈ మేరకు ఎయిర్ ఫ్రాన్స్ తన సిబ్బందికి సమాచారం అందించింది.

ఇటీవల ఫ్లైదుబాయ్ విమానంలో చోటుచేసుకున్న భద్రతా సంఘటనే ఈ కఠిన నిబంధనలకు దారితీసింది. సెప్టెంబర్ 30న దుబాయ్ నుంచి టెల్ అవీవ్‌కు వెళ్తున్న ఫ్లైదుబాయ్ విమానాన్ని ఒమన్‌కు చెందిన సహ పైలట్ హైజాక్ చేసేందుకు యత్నించిన విషయం తెలిసిందే. బెన్ గురియన్ విమానాశ్రయాన్ని ఢీకొట్టేందుకు ప్లాన్ చేశాడని, ఈ క్రమంలో భారత కెప్టెన్‌పై దాడి చేశాడని తెలిసింది. ఈ ఘటన జరిగిన మరుసటి రోజే ఇజ్రాయెల్ రవాణా మంత్రిత్వ శాఖ విదేశీ విమానయాన సంస్థలకు ఓ ఆదేశం జారీ చేసింది. పాకిస్థాన్, ఇరాన్, సౌదీ అరేబియా, అల్జీరియా, ట్యూనీషియా, ఒమన్ వంటి 31 ముస్లిం మెజారిటీ దేశాల జాతీయత లేదా ద్వంద్వ పౌరసత్వం ఉన్న సిబ్బందిని ఇజ్రాయెల్‌కు వచ్చే విమానాల్లో నియమించవద్దని స్పష్టం చేసింది. ఈ నిబంధనలను పాటించకపోతే సంస్థతో పాటు ఉద్యోగులు కూడా చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఎయిర్ ఫ్రాన్స్ తన అంతర్గత మెమోలో పేర్కొన్నట్లు సమాచారం. అయితే, ఎయిర్ ఫ్రాన్స్ నిర్ణయం ఫ్రాన్స్‌లో న్యాయపరమైన చిక్కులకు దారితీసే అవకాశం ఉంది. జాతీయత లేదా మతం ఆధారంగా వివక్ష చూపడాన్ని ఫ్రెంచ్ ఉపాధి చట్టాలు నిషేధిస్తున్నాయి. ఇది ఆ దేశ చట్టాలకు విరుద్ధమని న్యాయ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు దేశ భద్రత దృష్ట్యా తన గగనతలాన్ని నియంత్రించుకునే హక్కు ఇజ్రాయెల్‌కు ఉన్నప్పటికీ, ఈ నిబంధనలను అమలు చేయడం వల్ల విమానయాన సంస్థలు తమ సొంత దేశాల్లో న్యాయపరమైన సవాళ్లను ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది. ఈ నిబంధనల వల్ల విమానయాన సంస్థల సిబ్బంది షెడ్యూలింగ్‌పై ఎలాంటి ప్రభావం పడుతుందనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు.

## భారత్ ఎదుగుదలను మేమే పరిమితం చేసుకోలేం

- మొదటి పేజి తరువాయి

ఫోరమ్'లో జరిగిన ఒక చర్చా కార్యక్రమంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్‌ను మధ్యస్థ శక్తిగా ఎందుకు అభివర్ణించకూడదు అని అడిగిన ప్రశ్నకు జైశంకర్ బదులిస్తూ, "ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా, సుమారు నాలుగు ట్రిలియన్ డాలర్ల జీడీపీతో, భవిష్యత్తులో అపారమైన అభివృద్ధి అవకాశాలు ఉన్న దేశానికి 'మధ్యస్థాయి శక్తి' అనే వర్ణన సౌకర్యంగా ఉండదు. ఆ నిర్వచనంతో మనల్ని మనమే పరిమితం చేసుకున్నట్లు అవుతుంది" అని వివరించారు. ఇతరులకు సాధికారత కల్పించే దేశాలనే మధ్యస్థ శక్తులుగా ప్రధాని మోదీ అభివర్ణించారని, కానీ భారత్ విషయంలో ఈ నిర్వచనం సరిపోదని ఆయన తెలిపారు. ప్రస్తుత ప్రపంచం కేవలం మధ్యస్థాయి శక్తులతోనే కాకుండా ఇతర దేశాలపై ఒత్తిడి తెచ్చే సాధనాలతో నిండి ఉందని జైశంకర్ విశ్లేషించారు. "ఆర్థిక ఆంక్షలు, ఫైనాన్స్ వంటి అంశాలను కూడా ఇప్పుడు అస్త్రాలుగా వాడుకుంటున్నారు. ఇది ప్రపంచాన్ని మరింత సంక్లిష్టంగా మారుస్తోంది" అని ఆయన అన్నారు. భవిష్యత్తులో పోటీ స్వరూపం మారనుందని జైశంకర్ అభిప్రాయపడ్డారు. ప్రతి దేశం తమ బలాలు, వనరులతో చర్చలకు వస్తుందని, పరస్పర అవసరాల ఆధారంగా ఒప్పందాలు ఉంటాయని అన్నారు. "చర్చల్లో ఎవరు ఎక్కడ కూర్చుంటారు, ఎవరు గట్టిగా మాట్లాడతారు అనే విషయాలు మారుతాయి. ఈ మార్పుల గురించి నిరాశావాద దృక్పథం అవసరం లేదు" అని ఆయన భవిష్యత్ ప్రపంచ తీరును అంచనా వేశారు.

పెన్ పవర్
మార్కాపురం - ప్రకాశం

# రూ.67.44 లక్షలతో నిర్మించిన స్వర్ణ గ్రామం భవనం, రైతు సేవా కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి





**గిద్దలూరు:పెన్ పవర్ అక్టోబర్ 14**

రాచర్ల మండలం ఆకవీడు గ్రామంలో రూ.67.44 లక్షల వ్యయంతో నిర్మించిన స్వర్ణ గ్రామం భవనం, రైతు సేవా కేంద్రాన్ని గిద్దలూరు ఎమ్మెల్యే శ ముత్తుముల అశోక్ రెడ్డి మంగళవారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్థానిక నాయకులు, గ్రామ ప్రజలు మేళతాళాలతో ఘన స్వాగతం పలికి, శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి భవనాన్ని ప్రారంభించారు గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధితో పాటు రైతులకు ప్రభుత్వ సేవలు మరింత చేరువ కావడంలో రైతు సేవా కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తాయని , పంటలకు సంబంధించిన, విత్తనాలు పంపిణీ, వ్యవసాయ రంగం మీద సలహాలు ఇవ్వడం జరుగుతుంది అని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు

**ఆకవీడు గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు.. రూ.13 లక్షలతో మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం!**

పల్లె పండుగ 3.0లో భాగంగా ఎంపీ నిధులతో నిర్మాణం.. ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి రాచర్ల మండలం ఆకవీడు గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా ఎంపీ నిధులు రూ.13 లక్షలతో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ప్రారంభించారు. గ్రామీణ ప్రజలకు పరిశుభ్రమైన తాగునీటిని అందుబాటులోకి తీసుకురావడంలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్‌తో గ్రామ ప్రజలకు ప్రయోజనం చేకూరనుంది. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

**ప్రజల తాగునీటి కష్టాలకు తక్షణ పరిష్కారం.. బోరు వేయించి నీటి సరఫరా పునరుద్ధరణ!**

చొల్లవీడు వడ్డెర బజారులో తాగునీటి సమస్యపై ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి తక్షణ స్పందన రాచర్ల మండలం చొల్లవీడు గ్రామంలోని వడ్డెర బజారులో నెలకొన్న తాగునీటి సమస్యపై గిద్దలూరు ఎమ్మెల్యే శ్రీ ముత్తుముల అశోక్ రెడ్డి తక్షణమే స్పందించారు. తాగునీటి ఇబ్బందులతో అవస్థలు పడుతున్న స్థానిక ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి సమస్యను తీసుకెళ్లగా, ఆయన వెంటనే అధికారులను అప్రమత్తం చేసి యుద్ధప్రాతిపదికన బోరు వేయించి నీటి సరఫరాను పునరుద్ధరించారు. దీంతో ఎన్నో రోజులుగా తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న స్థానికులకు ఉపశమనం లభించింది. సమస్యను తమ దృష్టికి తీసుకువచ్చిన వెంటనే స్పందించి తాగునీటి సౌకర్యం కల్పించిన ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి స్థానిక ప్రజలు, మహిళలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారిని శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ప్రజల కనీస అవసరాలైన తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడంపై స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

# విదేశీయుల వసతి వివరాలను తెలియజేయాలి

## – లేకుంటే కఠిన చర్యలు ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు

**ఒంగోలు క్రైమ్, పెన్ పవర్ అక్టోబర్ 14**

ప్రకాశం జిల్లా లో విదేశీయులకు ఆశ్రయం కల్పించే హోటల్స్, గెస్ట్ హౌస్ లు, గృహ యజమాన్యాలు, ఆసుపత్రులు, హాస్టళ్ళు, ఆశ్రమాలు, సత్రాలు, విద్యాసంస్థలు ఇతర సంస్థల నిర్వాహకులు, యాజమాన్యాలు తప్పనిసరిగా వారి వద్ద ఆశ్రయం పొందే విదేశీయుల రాక, బస, బయలుదేరే వివరాలను ( కార్డుదారులు, నేపాల్, భూటాన్ దేశాల పౌరులతో సహా) నిర్దేశిత విధానంలో డిజిటల్ రిపోర్టింగ్ (ఫారం–ఫారం–సి) ద్వారా తప్పనిసరిగా నమోదు చేసి ఎఫ్.ఆర్.ఓ. (ఫారనర్స్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్/సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్) వారికి 24 గంటల సమయంలోగా తెలియజేయాలని





జిల్లా ఎస్పీ వి హర్ష వర్ధన్ రాజు తెలిపారు. వివిధ దేశాల నుంచి జిల్లాకు వివిధ పనులు, విద్య, వైద్యం, పర్యటన, ఇతర అవసరాల నిమిత్తం వచ్చే విదేశీయులు, పాస్ పోర్టు, వీసా, వ్యక్తిగత వివరాలు, వసతి వివరాలు, వచ్చిన తేదీ తదితర నిర్దేశిత వివరాలను ది ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ చట్టం 2025, సెక్షన్ 8 ప్రకారం తప్పనిసరిగా వెబ్ సైట్ ద్వారా నమోదుచేసి 24 గంటలలోగా ఎఫ్.ఆర్.ఆర్.ఓ, ఎఫ్.ఆర్.ఓ. కార్యాలయాలకు సకాలంలో అందించాల్సిన బాధ్యత వారికి వసతి, ఆశ్రయం కల్పించే సంస్థలపై ఉందని తెలిపారు. సంబంధిత ఆన్ లైన్ వ్యవస్థలో నమోదు చేయడంలో సంస్థల24 యాజమాన్యాలు నిర్లక్ష్యం చేయరాదని పేర్కొన్నారు. విదేశీయుల వివరాలను నిర్దేశిత పోర్టల్ ద్వారా నమోదు చేయకుండా నిబంధనలను ఉల్లంఘిస్తూ వ్యవహరించినట్లయితే యాజమాన్యాలపై ది ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ చట్టం 2025, సెక్షన్ 23(బి) ప్రకారం రూ.50 వేల నుంచి రూ.1 లక్ష వరకు జరిమాన లేదా 2 సంవత్సరాల నుంచి 7 సంవత్సరాల వరకు జైలు లేదా రెండూ విధించే అవకాశం ఉందని తెలిపారు. అందువల్ల హోటల్ యాజమాన్యాలు, గెస్ట్‌హౌస్‌లు, వ్యక్తిగత గృహ యజమానులు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, ఇతర సంబంధిత సంస్థలు విదేశీయులకు వసతి లేదా సేవలు కల్పించే సమయంలో చట్టపరమైన విధివిధానాలను తప్పనిసరిగా పాటించాలని, జిల్లాకు వచ్చే విదేశీయులు భారతదేశ చట్టాలను గౌరవించాలని, చెల్లుబాటులో ఉన్న వీసా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ సూచించారు.

# జర్నలిస్టులపై దాడులు అరికట్టాలి

## -ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర నాయకులు గొట్టిపాటి నాగేశ్వరరావు డిమాండ్

## - ఒంగోలు కలెక్టరేట్ వద్ద ఏపీడబ్ల్యూజేఎఫ్ ధర్నా

**ఒంగోలు కలెక్టరేట్, పెన్ పవర్ అక్టోబర్ 14**



దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు గొట్టిపాటి నాగేశ్వరావు డిమాండ్ చేశారు. న్యూఢిల్లీలో విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులపై దాడులు చేసేందుకు తెగబడిన పోలీసుల వైఖరిని నిరసిస్తూ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్, ఆంధ్ర ప్రదేశ్ బ్రాడ్కాన్ జర్నలిస్ట్ అసోసియేషన్ లు పిలుపు మేరకు బుధవారం ఒంగోలు కలెక్టరేట్ వద్ద జర్నలిస్టులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా గొట్టిపాటి నాగేశ్వరావు మాట్లాడుతూ ఓటర్ల జాబితాలోని అక్రమాలపై ప్రశ్నిస్తూ న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్దకు చేరుకుంటున్న ఉపాధ్యాయులు, రచయితలు, కార్మిక సంఘాల నాయకులు, వివిధ ప్రతిపక్ష పార్టీల ఆందోళన సమాచారాన్ని చేరవేసేందుకు వెళ్లిన, వెళుతున్న జర్నలిస్టులపై ఆంక్షలు పెట్టి నిర్బంధించే ప్రయత్నం చేసిన పోలీసుల వైఖరి గర్హనీయమన్నారు. మీడియా అని చెబుతున్నప్పటికీ వినకుండా పలువురు జర్నలిస్టులను అనేక చోట్ల న్యూఢిల్లీలో పోలీసులు నిర్బంధించటమే కాక దురుసుగా వ్యవహరించారని మండిపడ్డారు. మీడియా స్వేచ్ఛకు భంగం కలిగించే ఈ వైఖరికి నిరసనగా ఫెడరేషన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టామన్నారు. అదే విధంగా జర్నలిస్టులపై దాడులు అరికట్టేందుకు రాష్ట్ర.. జిల్లా స్థాయిలో ఎటాక్స్ కమిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా నాయకులు కలెక్టరేట్ పరిపాలనాధికారి రవికుమార్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ధర్నాకు మద్దతుగా రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పేరయ్య, ఓ పి డి ఆర్ రాష్ట్ర అధ్యక్షులు చావలి సుధాకర్ మద్దతు తెలియజేశారు. కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర నాయకులు ఎస్.వి బ్రహ్మం, వి. భక్తవత్సలం, జిల్లా కార్యదర్శి దాసరి సునీల్, మీడియా ఇన్చార్జ్ ఎల్. రాజు, మీడియా కెమెరామెన్ అసోసియేషన్ అధ్యక్షులు వి నాగేశ్వరరావు, మాజీ అధ్యక్షులు ఇఫ్తేకర్ బాషా,టీవీ 9 స్టాఫ్ రిపోర్టర్ పై రోజ్ బేగ్, టీవీ5 స్టాఫ్ రిపోర్టర్ ఎన్ జనార్ధన్ రావు, సాక్షి టీవీ స్టాఫ్ రిపోర్టర్ మీసాల శ్రీనివాస్, పి9 టీవీ మేనేజింగ్ డైరెక్టర్ పి. కిరణ్, ఆంధ్రప్రభ బ్యూరో ఇన్చార్జ్ పి.వి భాస్కర్ రెడ్డి, ఓ జి మీడియా ప్రతాపరెడ్డి, సీనియర్ జర్నలిస్టులు ఆర్ వి రాజశేఖర్, మంకాల రామకృష్ణ, డి జె ఎఫ్ కన్వీనర్ బొడ్డు శ్రీనివాసరావు, పి శ్రీనివాసరావు, సురేష్, బ్రహ్మయ్య, సిహెచ్ నరసింహారావు, జె ఏడుకొండలు, వెంకటేశ్వర రెడ్డి, సురేష్, సీనియర్ కెమెరామెన్ టి. బాలాజీ కుమార్, వీడియో జర్నలిస్టులు టి.రాజు, రామరాజు, శివరాం, నక్క వాసు, కొండారెడ్డి, జర్నలిస్టులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజాభిప్రాయం మేరకే

# అభ్యర్థుల ఎంపిక

## -త్వరలోనే కందుకూరు మున్సిపాలిటీ చైర్మన్ అభ్యర్థి ప్రకటన

## -స్థానిక ఎన్నికల్లో 100 శాతం గెలుపు మాదే

## -మీడియా సమావేశంలో భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి

## -పనితీరు చూసి, ఓట్లు వేయాలని ఎమ్మెల్యే ఇంటూరి విజ్ఞప్తి



**కందుకూరు పెన్ పవర్, అక్టోబర్ 14:**

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానిక ఎన్నికల జిల్లా పరిశీలకులు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, కందుకూరులోని టిడిపి కార్యాలయంలో బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు, కూటమి పార్టీల కార్యకర్తల అభిప్రాయం మేరకే అభ్యర్థులను ఎంపిక చేయడం జరుగుతుంది. సర్వేలు, ఐ వి ఆర్ ఎస్ కాల్స్ ద్వారా అభ్యర్థులను నిర్ణయిస్తాం. వందకు వంద శాతం స్థానాలు దక్కించుకుంటాం. కందుకూరు నియోజకవర్గంలో 5 ఎంపీపీ, 5 జడ్పిటిసి, 59 ఎంపీటీసీ, 92 పంచాయతీ స్థానాల్లో జెండా ఎగరవేయటం ఖాయం అని అన్నారు. కందుకూరు మున్సిపాలిటీ చైర్మన్ అభ్యర్థిని మూడు నాలుగు రోజుల్లో హైకమాండ్ నిర్ణయిస్తుంది. ఎవరికి సీటు వచ్చినా సరే, మిగిలిన వారు పార్టీ అభ్యర్థి గెలుపు కోసం పనిచేయాలి. అవకాశం రానివారు నిరాశ చెందవద్దు. అలాంటివారికి పార్టీ పదవుల్లో సముచిత స్థానం ఉంటుంది అని అన్నారు. మున్సిపాలిటీలో అభివృద్ధిని అడ్డుకోవడానికి, హైకోర్టులో వైసీపీ నేతలు కేసులు వేశారు. ఇంటూరి నాగేశ్వరరావు ఎమ్మెల్యే అయినప్పటి నుంచి, పట్టుదలతో పోరాడి అడ్డంకులను తొలగించారు. 15 ఏళ్ల తర్వాత జరుగుతున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థికి పట్టం కట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు. చైర్మన్, 40 కౌన్సిలర్ స్థానాలను గెలుచుకుంటామని ధీమాగా చెబుతున్నాను అని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనేకమంది ముందుకు వస్తున్నారు. ముఖ్యంగా మహిళలు, యువకులు పోటీకి ఆసక్తి చూపుతున్నారు అని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో స్థానిక సంస్థలను నిర్వీర్యం చేశారు. నిధులను దారి మళ్ళించారు. ఫలితంగా అభివృద్ధి ఆగిపోయింది. గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి చెందాలన్నా, గ్రామ స్వరాజ్యం రావాలన్నా కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం అని రాంగోపాల్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో గ్రామీణ ప్రాంతాలు కళ తప్పాయి. ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టకుండా ప్రజలను మోసం చేశారు. ఇప్పుడు స్థానిక ఎన్నికల పేరుతో మళ్లీ మాయ మాటలు చెప్పటానికి వైసీపీ నేతలు రాబోతున్నారు. వారి మాటలు విని మరోసారి మోసపోకండి అని అన్నారు. ఈరెండేళ్లలో చంద్రబాబు నాయుడు సారథ్యంలోని ప్రభుత్వం, ఎన్ని మంచి పనులు చేసిందో ఒక్కసారి గమనించండి. జగన్ ప్రభుత్వం విధ్వంసాన్ని జ్ఞాపకం చేసుకోండి. మీరే బేరీజు వేసుకుని, మా అభ్యర్థులను మంచి మెజారిటీతో గెలిపిస్తారని కోరుకుంటున్నాను. ప్రతి ఒక్కరూ ఇంటింటికీ వెళ్లి పథకాలను తెలియజేయండి. బంధువులు, స్నేహితులకు కూడా వివరించి ఓట్లు వేయించాలని కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలకు విజ్ఞప్తి చేస్తున్నాను అని నాగేశ్వరరావు పేర్కొన్నారు. అంతకుముందు పార్టీ కార్యాలయానికి వచ్చిన ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి ని పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో పట్టణ టిడిపి అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, మండల పార్టీల అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావు, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, పూరిమిట్ల గురునాథం, మాదాల లక్ష్మీనరసింహం, ఒంగోలు డైరీ మాజీ చైర్మన్ చల్లా శ్రీను, పట్టణ మాజీ అధ్యక్షులు కంద్రా మాల్యాద్రి, పిడికిటి వెంకటేశ్వర్లు, మంగపాటి కృష్ణయ్య, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఉప్పుటూరి శ్రీను, అప్పనబోయిన నరసింహం, నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షులు ఉన్నం వీరాస్వామి, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధుబాబు, ఏపీ ఈ డబ్ల్యూ ఐ డి కార్పొరేషన్ డైరెక్టర్ పోకూరి రాంబాబు, నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి చదలవాడ కొండయ్య, కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ రూబీ, రాష్ట్ర కమిటీ నాయకులు బెజవాడ ప్రసాద్, షేక్ రఫీ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# రిజర్వేషన్లు ఖరారు ఆశావాహుల్లో హడావుడి

## స్థానిక ఎన్నికలపై గ్రామాల్లో జోరుగా చర్చలు

## ఎవరికి దక్కనుంది అవకాశం? ఆశావహుల్లో ఉత్కంఠ





**సి ఎస్ పురం, పెన్ పవర్ అక్టోబర్ 14**

స్థానిక సంస్థల ఎన్నికలపై ఆశలు పెట్టుకున్న నాయకుల్లో జడ్పీటీసీ, ఎంపీపీ రిజర్వేషన్లను మండలంలో జడ్పీటీసీ స్థానం ఓసీ జనరల్, ఎంపీపీ స్థానం బీసీ జనరల్ కు కేటాయించడంతో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఇన్నాళ్లు ఎన్నికల కోసం ఎదురుచూస్తున్న ఆశావహులు ఇప్పుడు తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. ప్రధాన రాజకీయ పార్టీలైన తెలుగుదేశం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీల్లో ఎవరికి అవకాశం దక్కుతుందన్న అంశంపై చర్చలు మొదలయ్యాయి. దీంతో మండలంలో ఎక్కడ చూసినా స్థానిక ఎన్నికల గురించే ప్రస్తావన కనిపిస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో జడ్పీటీసీ స్థానం ఓసీ జనరల్ కు కేటాయించడంతో ఈ స్థానం నుంచి పోటీ చేసేందుకు ఆశావహులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు మరోవైపు ఎంపీపీ స్థానం బీసీ జనరల్ కు కేటాయించడంతో ఆ సామాజిక వర్గానికి చెందిన నాయకులు తమ రాజకీయ అవకాశాలపై దృష్టి సారిస్తున్నారు. ఎవరికి వారు తమకు అనుకూలమైన పరిస్థితులను అంచనా వేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఆయా పార్టీల తరఫున బరిలోకి దిగే అభ్యర్థుల గురించి చర్చించుకుంటున్నారు జడ్పిటిసి ఎంపీపీ పదవులకు అభ్యర్థులుగా పోటీ చేయాలని ఆశావాహులు తమ అభ్యర్థిత్వాన్ని పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతుంది అయితే రెండు పార్టీల నుంచి అధికారికంగా అభ్యర్థుల ప్రకటన వెలువడాల్సి ఉండటంతో ఎవరికి అవకాశం దక్కుతుందన్న అంశంపై ఉత్కంఠ నెలకొంది రిజర్వేషన్ల ప్రకటనతో మండలంలోని గ్రామాల్లో రాజకీయ సందడి కనిపిస్తుంది టిడిపి నుంచి జెడ్పిటిసి అభ్యర్థిగా ఎవరు నిలబెడతారు? వైఎస్సార్ సీపీ తరఫున ఎవరికి అవకాశం లభిస్తుంది? ఎంపీపీ పదవి పై జోరుగా చర్చించుకుంటున్నారు ఇప్పటివరకు తెర వెనుక సాగిన ఆశావాహుల ప్రయత్నాలు ఇకపై మరింత వేగం వేగం పుంజుకునే సూచనలు కనిపిస్తున్నాయి రానున్న రోజుల్లో అభ్యర్థుల ఎంపికల్లో చోటు చేసుకునే పరిణామాలు అభ్యర్థుల ఎంపికను ప్రజలు చర్చించుకుంటున్నారు.

## గిద్దలూరు మండల నూతన తహశీల్దార్ టి. ఫణీశ్రుడు భాధ్యతల శ్వీకారం

**నూతన తహశీల్దార్ కు స్వాగతం పలికిన సిబ్బంది, ఘన సన్మానం**



**గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 14**

గిద్దలూరు మండల నూతన తహశీల్దార్గా టి. ఫణీశ్రుడు బుధవారం గిద్దలూరు లో భాద్యతలు సవీకరించారు. సందర్భంగా గిద్దలూరు తహశీల్దార్ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఘనంగా స్వాగతించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ఏ నాయబ్ హుస్సేన్, మండల సర్వేయర్ ఎమ్ ఆంజనేయులు, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ భాస్కర్ రావు, గ్రామ రెవెన్యూ అధికారుల సంఘ రాష్ట్ర కోశాధికారి వై పి రంగయ్య , గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అరిగేలా వెంకట రామయ్య, బి వెంకటేశ్వర్లు ఎస్ ఈశ్వర్ రెడ్డి ఎన్ నాగేంద్రుడు పి కొండయ్య, .కె వి వి రమణ సిఎస్ స్వర్ణలత ఏ లక్ష్మీదేవి , గ్రామ రెవిన్యూ అధికారులు, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరామ అజయ్ కుమార్, గ్రామ సర్వేయర్లు ఖాజావలి, రాము, వినోద్, మురళి, రమేష్ గ్రామ సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఓ ఆంజనేయులు, నాయకుడు అల్లూరయ్య సి హెచ్ శ్రీనివాసులు ఎస్కే కాజా రామయ్య మల్లికార్జున సుధీర్ , గ్రామ సహాయకులు ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన రూరల్ ఎస్సై



**కందుకూరు పెన్ పవర్, అక్టోబర్ 14**

కందుకూరు రూరల్ ఎస్సైగా కె. మరిడి నాయుడు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే తో పాటు పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి ని కూడా కలిసి మొక్కను అందించారు. స్థానిక సంస్థల ఎన్నికలు ప్రక్రియ మొదలు కాబోతున్న నేపథ్యంలో... కందుకూరు మండలంలో శాంతి భద్రతల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు ఎస్సైకి సూచించారు.

## ఎన్నికల నగారా మ్రోగింగింది



**గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 14**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల సంబంధించి నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో, ఎన్నికల ప్రవర్తనా నియమావళికి అనుగుణంగా రాజకీయ పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలు, బ్యానర్లు, జెండాలు ఏర్పాటు చేసిన సంబంధిత వ్యక్తులు వాటిని ఈ ప్రకటన వెలువడిన సమయం నుండి 24 గంటలలోపు తొలగించవలెనని అసిస్టెంట్ ఎన్నికల అథారిటీ , మున్సిపల్ కమిషనర్తెలియజేశారు నిర్దేశించిన గడువులోపు సదరు ఫ్లెక్సీలు, బ్యానర్లు, జెండాలను తొలగించని పక్షంలో, ఎన్నికల ప్రవర్తనా నియమావళి మేరకు తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అందరూ ఎన్నికల నియమావళిని అనుసరించసాలన్నారు.

## వలేటివారిపాలెం ఎస్సైగా సత్యనారాయణ బాధ్యతల స్వీకరణ

**వలేటివారిపాలెం, పెన్ పవర్ అక్టోబర్ 14**




వలేటివారిపాలెం మండల నూతన ఎస్సైగా సిహెచ్ సత్యనారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఇక్కడ ఎస్సైగా పనిచేస్తున్న బి. ప్రేమ్ కుమార్ బదిలీపై ఒంగోలు వన్ టౌన్కు వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం నూతన ఎస్సై సత్యనారాయణ మాట్లాడుతూ.. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, అక్రమ కార్యకలాపాలు, మట్కా, గంజాయి, అక్రమ మద్యం రవాణాపై ఉక్కుపాదం మోపుతానని తెలిపారు. ప్రజలు ఎటువంటి సమస్య ఉన్నా నేరుగా పోలీస్ స్టేషన్ కు వచ్చి తెలియజేయాలని, తమకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొని నూతన ఎస్సైకి శుభాకాంక్షలు తెలిపారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ ప్రాణాలు నిలబెడుతోంది

**-భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి -సీఎంఆర్ఎఫ్ నిధులు తీసుకురావడంలో ఎమ్మెల్యే కష్టపడుతున్నారు**

**-కులమతాలు, పార్టీలకు అతీతంగా వైద్య సహాయం అందిస్తున్నారు -ఈ సేవకు గుర్తుగా.. ఓటుతో కూటమికి మద్దతు పలకండి**







**కందుకూరు పెన్ పవర్, అక్టోబర్ 14:**

కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించగా.. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానిక సంస్థల జిల్లా పరిశీలకులు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. నేతలిద్దరూ కలిసి 120 మంది లబ్ధిదారులకు – 51 లక్షలా 87 వేల రూపాయల విలువైన చెక్కులను అందజేశారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు 46 విడతలుగా 2,102 మందికి 15,15,23,127 రూపాయల సహాయాలను అందించామని ఎమ్మెల్యే నాగేశ్వరరావు వెల్లడించారు. గుడ్లూరు మండలం – 24 మందికి – 9,66,333కందుకూరు మండలం – 23 మందికి – 11,93,998 కందుకూరు అర్బన్ – 23 మందికి – 8,55,434లింగసముద్రం మండలం – 25 మందికి – 10,33,737ఉలవపాడు మండలం – 8 మందికి – 2,59,100వలేటివారిపాలెం మండలం – 17 మందికి – 8,78,404 లను అందజేశారు. ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వంలో సీఎం రిలీఫ్ ఫండ్ అంటే ఏమిటో చాలామందికి తెలియదు. కానీ కూటమి ప్రభుత్వంలో ఎక్కువగా నిధులు ఇచ్చి ప్రాణాలు నిలబెడుతున్నాం అని అన్నారు. కందుకూరు నియోజకవర్గంలో ఇప్పటివరకు 2100 మందికి సాయం చేయడం అంటే చాలా గొప్ప విషయం. ఈ విషయంలో ఎక్కువ నిధులు తీసుకొచ్చిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు ని ప్రత్యేకంగా అభినందిస్తున్నాను అని అన్నారు. వైద్య సహాయాలు పొందిన వారందరూ... ఈ ప్రభుత్వం చేస్తున్న మేలును గుర్తుపెట్టుకోవాలి. రాబోయే ఎన్నికల్లో అండగా నిలవాలి అని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ సుదీర్ఘ రాజకీయ అనుభవంతో చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని ప్రగతి పథంవైపు నడిపిస్తున్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం పట్టుబట్టి పనిచేస్తున్నాను. ఇంత పెద్ద స్థాయిలో పేదలకు వైద్య సాయం అందించడం సంతోషంగా ఉంది అని అన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడు, అధికారంలో ఉన్న వారికి అండగా నిలబడితే, మరింత అభివృద్ధి చేయడానికి అవకాశం ఉంటుంది. కాబట్టి ప్రభుత్వానికి మద్దతుగా ఓటు వేయండి. తెలుగుదేశం, బిజెపి, జనసేన పార్టీల నేతలు, కార్యకర్తలు కలసి పనిచేసి, స్థానిక ఎన్నికల్లో గెలుపుకు కృషి చేయండి అని ఎమ్మెల్యే నాగేశ్వరరావు కోరారు. స్థానిక టిడిపి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, పూరిమిట్ల గురునాథం, రాచగర్ల సుబ్బారావు, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, మాదాల లక్ష్మీనరసింహం, నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షులు ఉన్నం వీరాస్వామి, పట్టణ మాజీ అధ్యక్షులు కంద్రా మాల్యాద్రి, పిడికిటి వెంకటేశ్వర్లు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఉప్పుటూరి శ్రీను, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# అవయవ దానం.. పదుగురికి జీవన దానం

**– కిమ్స్ వైద్యుల ప్రబోధంతో బ్రెయిన్ డెడ్ అయిన యువకుడి అవయవదానానికి కుటుంబ సభ్యుల అంగీకారం**

**– నల్లమోతు బాబూరావు కుటుంబం మానవతా దృక్పథానికి నిదర్శనం**

**ఒంగోలు క్రైమ్, పెన్ పవర్ అక్టోబర్ 14**




ప్రకాశం జిల్లా మద్దిపాడు గ్రామానికి చెందిన నల్లమోతు బాబురావు (32) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బ్రెయిన్ డెడ్కు గురయ్యారు. ఈ విషాద సమయంలో ఆయన కుటుంబ సభ్యులు అవయవదానానికి అంగీకరించి మానవత్వాన్ని చాటుకున్నారు. బాబురావు బైక్పై ప్రయాణిస్తుండగా ప్రకాశం జిల్లా తిమ్మాపురం గ్రామం వద్ద కారు ఢీకొనడంతో ప్రమాదానికి గురయ్యారు. తొలుత ఆయనను ఒంగోలులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి కిమ్స్ హాస్పిటల్స్, ఒంగోలుకు తీసుకొచ్చారు. అక్కడ చికిత్స అందించిన డాక్టర్ ఎం.ఏ. జగదీష్ కుమార్ ఆధ్వర్యంలో అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించారు. పరీక్షల అనంతరం బాబురావు బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు.

**జీవన్దాన్ ద్వారా అవయవదానంపై అవగాహన**

రోగి ఆరోగ్య పరిస్థితి, వైద్య పరీక్షల వివరాలను వైద్యులు కుటుంబ సభ్యులకు తెలియజేశారు. అనంతరం జీవన్దాన్ ప్రతినిధులు బాబురావు తల్లి ఎన్. రాఘవమ్మ, ఎన్. పూర్ణచంద్రరావు, నాగ మల్లేశ్వరిలకు అవయవదానం ప్రాముఖ్యతను వివరించి, ఇతర రోగులకు ప్రాణాలు నిలబెట్టుకునే అవకాశం కల్పించవచ్చని తెలియజేశారు. ఈ విషయాలను అర్థం చేసుకున్న కుటుంబ సభ్యులు తమ వ్యక్తిగత దుఃఖాన్ని దిగమింగుకుని అవయవదానానికి అంగీకరించారు. డాక్టర్ టి. ప్రవీణ్ కుమార్, ఆర్సీఓఓ, కె. అంకి రెడ్డి, సీఓఓ.. డాక్టర్ టి. శ్రీహరి రెడ్డి, మెడికల్ డైరెక్టర్,మాట్లాడుతూ ఆప్తుడిని కోల్పోయిన సమయంలో కుటుంబ సభ్యులు తీవ్ర మనోవేదనకు గురవుతారు. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ ఇతరుల ప్రాణాలను కాపాడేందుకు ముందుకు రావడం అభినందనీయం. బాబురావు కుటుంబ సభ్యుల నిర్ణయం సమాజానికి మానవత్వం, సామాజిక బాధ్యతల ప్రాముఖ్యతను తెలియజేస్తుందని పేర్కొన్నారు. అవయవదానానికి అంగీకరించిన కుటుంబ సభ్యులకు కిమ్స్ యాజమాన్యం ప్రత్యేక అభినందనలు తెలియజేసింది. అవయవదానం పట్ల ప్రజల్లో అవగాహన పెరగాలని, ఇలాంటి మానవతా నిర్ణయాలు సమాజానికి స్ఫూర్తిగా నిలవాలని యాజమాన్యం ఆకాంక్షించింది.

## ఒంగోలులో ఆంపియర్ ఎక్స్పీరియన్స్ సెంటర్ ప్రారంభం



**ఒంగోలు కల్చరల్, పెన్ పవర్ అక్టోబర్ 14**

నగర పరిధిలోని గుంటూరు బైపాస్ రోడ్డులో అంపియర్ ఎక్స్పీరియన్స్ సెంటర్ను బుధవారం ప్రారంభించారు. ఈ కొత్త ఆంపియర్ ఎక్స్పీరియన్స్ సెంటర్ వినియోగదారులకు ఒకే చోట సమగ్రమైన అమ్మకాలు, సేవా అనుభవాన్ని అందించనుంది. తద్వారా ఈ ప్రాంత వినియోగదారులకు ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని మరింత సులభతరం చేయడంతో పాటు వాటిని మరింత చేరువ చేయనుంది. ఈ కొత్త ఎక్స్పీరియన్స్ సెంటర్లో విభిన్న రకాల మొబిలిటీ అవసరాలు, వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా రూపొందించిన ఆంపియర్ ఎలక్ట్రిక్ స్కూటర్ పోర్ట్ఫోలియోను ప్రదర్శిస్తుంది. దీనిలో మాగ్నస్ జిమాక్స్, మాగ్నస్ నియో వంటివి ఉన్నాయి. ఈ పార్ట్ ఫోలియోకు ప్రధాన ఆకర్షణగా అంపియర్ । నెక్సస్ నిలుస్తుంది. కుటుంబాలు, డబ్బుకు తగ్గ విలువను కోరుకునే వినియోగదారుల కోసం రూపొందించిన మాగ్నస్ జీమాక్స్ రోజువారి అవసరాలకు అనుగుణమైన సౌలభ్యం, కనెక్టడ్ టెక్నాలజీ, అందుబాటు ధరలను సమన్వయం చేస్తుంది. ప్రధాన మార్కెట్లలో అంపియర్ వాణిజ్య, సేవా కార్యకలాపాలను విస్తరించడానికి, కస్టమర్లకు మరింత చేరువ చేయడానికి గ్రీవ్స్ ఎలక్ట్రిక్ మొబిలిటీ చేస్తున్న నిరంతర ప్రయత్నంలో భాగంగా ఈ కొత్త డీలర్షిప్ ప్రారంభించబడింది.

# కొమరోలు పంచాయతీ అభివృద్ధి అధికారిని వై గీతా ఆధ్వర్యంలో స్వచ్ఛపథ్ కార్యక్రమం

**కడప అమరావతి జాతీయ రహదారికి ఇరుపక్కల చెత్తాచెదారం తొలగింపు**

**రోడ్డుతో పాటు ఇరుపక్కల ప్రదేశాలను శుభ్రంగా ఉంచుకోవాలని పిలుపు**





**కొమరోలు పెన్ పవర్ అక్టోబర్ 14**

కొమరోలు గ్రామపంచాయతీ అభివృద్ధి అధికారిని యండల గీత ఆధ్వర్యంలో బుధవారం కడప- అమరావతి జాతీయ రహదారి పై స్వచ్ఛ పథ్ (పరిశుభ్రమైన దారి ) కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి నెల మూడో బుధవారం స్వచ్ఛపథ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం కొమరోలు గ్రామపంచాయతీ అభివృద్ధి అధికారిని వై. గీత ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ పరిశుద్య కార్మికులు కొమరోలు గ్రామం వెలుపల పెట్రోల్ సమీపంలో కడప- అమరావతి జాతీయ రహదారి ఇరుపక్కల గల ప్రదేశాలలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని,పెరిగిన చిల్ల చెట్లను తొలగించి శుభ్రపరిచారు అంతేకాక మురికితో నిండిన ప్రదేశాలలో బ్లీచింగ్ పౌడర్ చల్లి క్రిమి కీటకాల నివారణకు చర్యలు తీసుకున్నారు.ఆ సందర్భంగా కొమరోలు గ్రామపంచాయతీ అభివృద్ధి అధికారిని వై గీత మాట్లాడుతూ ప్రజలు తమ ఇళ్ళతో పాటు పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచు కుంటున్న విధంగానే, ప్రధాన రోడ్లు, రోడ్డకు వైపుల గల ఖాళీ ప్రదేశాలు కూడా శుభ్రంగా ఉండే విధంగా కృషి చేయాలని కోరారు. రోడ్లకు ఇరువైపుల ప్రదేశాలు శుభ్రంగా ఉన్నప్పుడే వాహనదారులకు పాదాచారులకు ఎంతో మేలు కలుగుతుందని అందువల్ల చెత్తాచెదారాన్ని రోడ్లకు ఇరువైపునగల ఖాళీ ప్రదేశాలలో వేయవద్దని ఆమె సూచించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పిలుపుమేరకు ప్రతినెలా మూడవ బుధవారం కొమరోలు గ్రామపంచాయతీ పరిధిలో స్వచ్ఛపథ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు. ఆ కార్యక్రమంలో కొమరోలు స్వర్ణ గ్రామ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

## కొమరోలు ఎంపీపీ,జడ్పీటిసి ఎంపీటీసీల స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు

**కొమరోలు జడ్పీటిసి పదవి ఓసి మహిళకు, ఎంపీపీ పదవి బీసీ మహిళలకు రిజర్వు.**

**రిజర్వేషన్లపై హర్షం వ్యక్తం చేస్తున్న మహిళా లోకం.**

**కొమరోలు పెన్ పవర్ అక్టోబర్ 14**

త్వరలో జరగనున్నస్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా కొమరోలు మండలంలోని ప్రధాన పదవుల స్థానాలు మహిళలకు రిజర్వ్ చేశారు. దీనితో మండల వ్యాప్తంగా మహిళా లోకం హర్షం వ్యక్తం చేస్తున్నది. స్థానిక సంస్థల ఎన్నికలు త్వరలో జరగనున్నాయి. వాటి కొరకు ఎంపీపీ,జడ్పీటిసి, ఎంపిటిసి స్థానాలకు ఎన్నికల కమిషన్ రిజర్వేషన్లను ప్రకటించింది. కొమరోలు ఎంపీపీ స్థానం బీసీ మహిళకు రిజర్వ్ చేయగా, జడ్పీటిసి స్థానం ఓసి మహిళకు రిజర్వ్ చేశారు. ఇక మండలంలోని 12 ఎంపీటీసీ స్థానాలకు కూడా రిజర్వేషన్లు ప్రకటించారు..కొమరోలు 1 ఎంపీటీసీ స్థానాన్ని అన్ రిజర్వుడ్ (మహిళా) గాను, కొమరోలు 2 ఎంపీటీసీ స్థానం అన్ రిజర్వుడ్ (మహిళకు) కొమరోలు మూడు ఎంపీటీసీ స్థానం బీసీ జనరల్ కు రిజర్వ్ చేశారు. ఇక మండలంలోని అల్లినగరం ఎంపీటీసీ స్థానాన్ని అన్ రిజర్వుడు గాను,చింతలపల్లి ఎంపీటీసీ స్థానాన్ని బీసీ మహిళలకు, దద్దవాడ ఎంపిటిసి స్థానాన్ని అన్ రిజర్వుడు గాను, ఎడమ కళ్ళు ఎంపీటీసీ స్థానాన్ని అన్ రిజర్వ్ మహిళకు కేటాయించారు. నల్లగుంట్ల ఎంపిటిసి స్థానాన్ని ఎస్సీ మహిళకు, రాజుపాలెం ఎంపిటిసి స్థానాన్ని బీసీ మహిళకు రిజర్వ్ చేశారు. రెడ్డి చర్ల ఎంపిటిసి స్థానాన్ని అన్ రిజర్వుగాను, సురవారిపల్లె ఎంపీటీసీ స్థానాన్ని ఎస్సీ జనరల్ కు, తాటిచెర్ల ఎంపిటిసి స్థానాన్ని బీసీ జనరల్ కు కేటాయించారు. మండలంలోని ప్రధాన ఎంపీపీ,జడ్పీటిసి పదవుల స్థానాలు మహిళా అభ్యర్థులకు రిజర్వు చేయడం పట్ల మండల వ్యాప్తంగా మహిళా లోకం హర్షం వ్యక్తం చేస్తున్నది. దీంతో ప్రధాన టిడిపి,వైసిపి పార్టీల నేతలు ఎంపీపీ జడ్పీటిసి ఎంపీటీసీ పదవులకు అభ్యర్థుల ఎంపికలో తలమునకులై ఉన్నారు.

# గట్కా, థాంగ్ టా మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో చత్తా చాటిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

## ఢిల్లీ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన ఏల్చూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలోని ముగ్గురు విద్యార్థులు






**సంతమాగులూరు, పెన్ పవర్ అక్టోబర్ 14**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అంతర్జిల్లా పాఠశాలల క్రీడా ఛాంపియన్షిప్ 2026--27లో భాగంగా కృష్ణా జిల్లా జగ్గయ్యపేటలోని ఎస్జీఎస్ కళాశాలలో ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించిన గట్కా, థాంగ్ టా మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో సంతమాగులూరు మండల విద్యార్థులు సత్తా చాటారు. వివిధ విభాగాల్లో బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించి మండలానికి గుర్తింపు తీసుకొచ్చారు. పలువురు విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. గట్కా మార్షల్ ఆర్ట్స్లో అండర్--17 ఫ్రి సోటి టీమ్ ఈవెంట్లో పగడాల కౌశిక్, జ్యోతి స్వరూప్, షాహిల్ అహ్మద్ వెండి పతకాలు సాధించారు. వీరిలో వెల్లలచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి పగడాల కౌశిక్ ఢిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి గట్కా పోటీలకు ఎంపికయ్యాడు. థాంగ్ టా మార్షల్ ఆర్ట్స్లో ఏల్చూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు బంగారు పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్--14 విభాగంలో దండూరి వెంకట మణికంఠ (o56 కేజీలు), అండర్--17 విభాగంలో వల్లెం జ్యోతి స్వరూప్ (65 కేజీలు), ఎస్.కె. షకీల్ హమీద్ (48 కేజీలు) బంగారు పతకాలు సాధించారు. థాంగ్ టా పోటీల్లో వెల్లలచెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి దినేష్ కార్తీక్ అండర్--14 విభాగంలో 37 కేజీల కేటగిరీలో, కౌశిక్ అండర్--17 విభాగంలో 56 కేజీల కేటగిరీలో కాంస్య పతకాలు సాధించారు. సంతమాగులూరులోని బాలాజీ పాఠశాల విద్యార్థి టీ. విజయ్ అండర్--14 విభాగంలో o53 కేజీల కేటగిరీలో కాంస్య పతకం సాధించాడు. సంతమాగులూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి మందపాటి ప్రదీప్ కుమార్ అండర్--19 బాలుర విభాగంలో 80 కేజీల కేటగిరీలో కాంస్య పతకం గెలుచుకున్నాడు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి చెందిన అండర్--19 విద్యార్థినులు కరిష్మా 54 కేజీల విభాగంలో, అమూల్య 58 కేజీల విభాగంలో వెండి పతకాలు సాధించారు. ఏల్చూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు థాంగ్ టా మార్షల్ ఆర్ట్స్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె. మాధవి, వ్యాయామ ఉపాధ్యాయుడు డాక్టర్ నాగబోతు వీరేంద్ర హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులను, శిక్షణ అందించిన కోచ్ గంటెనపాటి అఖిల్ను అభినందించారు. పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది విద్యార్థులకు, వ్యాయామ ఉపాధ్యాయుడికి శుభాకాంక్షలు తెలిపారు. జాతీయ స్థాయి పోటీల్లోనూ విద్యార్థులు పతకాలు సాధించి రాష్ట్రానికి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# ఎన్నికల నగారా మ్రోగింగింది





**గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 14**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల సంబంధించి నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో, ఎన్నికల ప్రవర్తనా నియమావళికి అనుగుణంగా రాజకీయ పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలు, బ్యానర్లు, జెండాలు ఏర్పాటు చేసిన సంబంధిత వ్యక్తులు వాటిని ఈ ప్రకటన వెలువడిన సమయం నుండి 24 గంటలలోపు తొలగించవలెనని అసిస్టెంట్ ఎన్నికల అథారిటీ , మున్సిపల్ కమిషనర్తెలియజేశారు నిర్దేశించిన గడువులోపు సదరు ఫ్లెక్సీలు, బ్యానర్లు, జెండాలను తొలగించని పక్షంలో, ఎన్నికల ప్రవర్తనా నియమావళి మేరకు తదుపరి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అందరూ ఎన్నికల నియమావళిని అనుసరించసాలన్నారు.

# అర్ధవీడు మండలంలో జడ్ పిటిసి, ఎంపీపి, ఎంపీటీసీల రిజర్వేషన్లు ఖరారు

**అర్ధవీడు, పెన్ పవర్, అక్టోబర్ 14**

అర్ధవీడు మండలంలో జడ్పిటిసి, ఎంపీపీ, ఎంపిటిసీల రిజర్వేషన్లు ఖరారు అయ్యాయి. అర్ధవీడు జడ్పిటిసి బీసీ జనరల్ కు, ఎంపీపీ ఓసి మహిళకు కేటాయించడం జరిగింది. అర్ధవీడు ఎంపీటీసీ బీసీ జనరల్,పాపినేనిపల్లి ఓసి జనరల్, వెలగలపాయ ఓసి మహిళ, దొనకొండ ఎస్సీ మహిళ, మొహిద్దిన్ పురం బీసీ మహిళ, బొల్లుపల్లె ఎస్సీ జనరల్, యాచవరం ఓసి మహిళ, కాకర్ల ఓసి మహిళ, మాగుటూరు ఓసి జనరల్, పెద్ద కందుకూరు ఎస్టీ జనరల్ కేటాయించడం జరిగింది..

# అయోధ్య రామిరెడ్డిని కలిసిన... మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు

**సి ఎస్ పురం, పెన్ పవర్ అక్టోబర్ 14**

ప్రకాశం జిల్లా రిజినల్ కో ఆర్డినేటర్ రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి ని బుధవారం తాడేపల్లిలోని వైసీపి కార్యాలయంలో కనిగిరి మాజీ ఎమ్మెల్యే విశాఖపట్నం పార్లమెంట్ వైసీపీ పరిశీలకులు కదిరి బాబురావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రివర్యులు అంబటి రాంబాబు,మోదుగుల వేణుగోపాల్ రెడ్డి, తదితరులు ఉన్నారు.



# పామూరుపల్లి గ్రామంలో ఉద్యాన రైతుల నుండి 70 దరఖాస్తుల స్వీకరణ

## గ్లోబల్ హార్టికల్చర్ హబ్ వారోత్సవాలను పురస్కరించుకొని దరఖాస్తులు స్వీకరణ

## గ్లోబల్ హార్టికల్చర్ హబ్ వారోత్సవాల వివరాలు వెల్లడించిన గిద్దలూరు ఉద్యానవన అధికారిని డి. శ్వేత





**కొమరోలు పెన్ పవర్ అక్టోబర్ 14**

అక్టోబర్ 12 నుండి 17వ తేదీ వరకు గ్లోబల్ హార్టికల్చర్ హబ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లుగా గిద్దలూరు ఉద్యానవన అధికారిని డి శ్వేత తెలిపారు. వారోత్సవాలలో భాగంగా బుధవారం కొమరోలు మండలంలోని పామూరుపల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆ గ్రామానికి చెందిన ఉద్యాన రైతుల నుండి వివిధ ఉద్యాన పథకాలకు సంబంధించి దరఖాస్తులను ఆమె స్వీకరించారు. గిద్దలూరు ఉద్యాన శాఖ అధికారి డి. స్వేత పామూరు పల్లె గ్రామాన్ని సందర్శించి, ఉద్యాన రైతుల అవసరాలను తెలుసుకొని, హైబ్రిడ్ కూరగాయల సాగు, వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు, బొప్పాయి, అరటి సాగు తదితర అంశాలకు సంబంధించి మొత్తం 70 దరఖాస్తులను సేకరించారు.ఆ సందర్భంగా ఉద్యాన శాఖ అధికారి మాట్లాడుతూ, గ్లోబల్ హార్టికల్చర్ హబ్ కార్యక్రమం ద్వారా ఉద్యాన పంటల విస్తీర్ణం పెంపు, ఆధునిక సాగు పద్ధతుల ప్రోత్సాహం, వ్యవసాయ యాంత్రీకరణ, సూక్ష్మ సేద్యం, పంట కోత అనంతర యాజమాన్యం, ప్రాసెసింగ్ యూనిట్లు మరియు విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని ఆమె వివరించారు.అక్టోబర్ 12 నుండి 17వ తేదీ వరకు నిర్వహిస్తున్న గ్లోబల్ హార్టికల్చర్ హబ్ వారోత్సవాలను ఉద్యాన రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఉద్యాన పంటల సాగుకు సంబంధించి మొక్కలు, యంత్ర పరికరాలు, డ్రిప్ ఇరిగేషన్, విస్తీర్ణం పెంపు, ప్రాసెసింగ్ యూనిట్లు లేదా ఇతర ఉద్యాన శాఖ పథకాల ద్వారా సహాయం అవసరమైన రైతులు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాలను సందర్శించి దరఖాస్తులను సమర్పించాలని శ్వేత సూచించారు.రైతుల నుండి స్వీకరించిన దరఖాస్తులను ఆన్లైన్ విధానంలో నమోదు చేసి, సంబంధిత పథకాల మార్గదర్శకాలు మరియు అర్హతల ప్రకారం తదుపరి పరిశీలన, చర్యల కోసం పంపించడం జరుగుతుందని ఆమె తెలిపారు.కావున ఉద్యాన రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకొని, తమకు అవసర మైన ఉద్యాన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి అక్టోబర్ 17వ తేదీలోపు సమీప రైతు సేవా కేంద్రాల్లో దరఖాస్తులు సమర్పించాలని గిద్దలూరు ఉద్యాన శాఖ అధికారిని డి శ్వేత కోరారు.

# నిత్యావసర వస్తువుల ధరల కట్టడికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలి

## – ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి డిమాండ్



**ఒంగోలు క్రైమ్, పెన్ పవర్ అక్టోబర్ 13**

పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలను తగ్గించాలని ఐద్వా జిల్లా వ్యాప్తంగా ప్రజల నుండి సేకరించిన సంతకాలు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి స్పీడ్ పోస్ట్ ద్వారా బుధవారం పంపించడం జరిగింది. జిల్లా హెడ్ పోస్ట్ ఆఫీస్ వద్ద నిరసన కార్యక్రమం జరిగినది. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి మాట్లాడుతూ పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించాలని రాష్ట్ర వ్యాప్తంగా ఐద్వా గా నిరసన కార్యక్రమాలు చేపట్టామని తమ నిరసనని ప్రభుత్వానికి తెలియజేశామని అయినా ఈ ప్రభుత్వం ధరల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్రవ్యాప్తంగా ఐదు లక్షల సంతకాలు ప్రజల నుండి సేకరించి ముఖ్యమంత్రికి పంపించడానికి కర్తవ్యం తీసుకున్నామని అందులో భాగంగా ప్రకాశం జిల్లా నుండి ప్రజలనుంచి సేకరించిన సంతకాలు ముఖ్యమంత్రి కి స్పీడ్ పోస్ట్ ద్వారా పంపించడం జరిగిందని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఒకే కూటమిగా నడుస్తున్నాయని కానీ ధరలు ఎందుకు అదుపు చేయలేకపోతున్నారని విమర్శించారు. సామాన్యులకు స్థిరమైన ఉపాధి లేక కనీస వేతనాలు లేక అనేక ఇబ్బందులు పడుతుంటే మూల్గే నక్క మీద తాటికాయ పడ్డ చందంగా ఎన్నడూ చూడని విధంగా ధరలు విపరీతంగా పెరిగాయని అన్నారు. సంతకాలు చేయించే క్రమంలో మహిళలు ధరలు పెరుగుదలపై ఆగ్రహంగా ఉన్నారని అన్నారు. ధరలు అదుపు చేయకపోతే భవిష్యత్తులో మహిళలు రోడ్డు ఎక్కడం ఖాయమన్నారు. ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.కె మున్వర్ సుల్తానా మాట్లాడుతూ ఎలక్షన్ ముందు రేషన్ డిపో ద్వారా నిత్యవసర వస్తువులు సరఫరా చేస్తామన్న హామీ ఏమైందన్నారు. రేషన్ డిపోలో బియ్యం తప్ప ఏమి ఇవ్వట్లేదని విమర్శించారు. ఇప్పటికే మహిళల్లో పిల్లల్లో పౌష్టికాహారము లేక రక్తహీనత తదితర అనారోగ్యంతోబాధపడుతున్నారని ధరలు ఇంతగా పెరిగితే భవిష్యత్తులో పౌష్టికాహారం లేక మహిళలు,పిల్లలు మరింత అనారోగ్యానికి గురవుతారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకులు కె. రాజేశ్వరి, యమ్.పద్మ, యస్.కె. మల్లిక, యస్.కె. అస్మ,తదితరులు పాల్గొన్నారు.

# గంగవరం బీసీ కాలనీకి ఊరట..!

## సొంత నిధులతో తూరలు ఏర్పాటు..



**పుల్లల చెరువు పెన్ పవర్ అక్టోబర్ 14**

వర్షం పడితే చాలు.. రాకపోకలకు ఇబ్బందులు.. నీటి ప్రవాహంతో అవస్థలు పడుతున్న గంగవరం బీసీ కాలనీ ప్రజలకు టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు పల్లపాటి బాదరయ్య అండగా నిలిచారు. బీసీ కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యను గుర్తించి తన సొంత నిధులతో ఆరు తూములు ఏర్పాటు చేయించడంతో పాటు రోడ్డుకి 30 ట్రిప్పుల మట్టితో పనులు చేపట్టారు. దీంతో వర్షాకాలంలో ప్రజలకు ఎదురయ్యే ఇబ్బందులు తగ్గుతాయని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**వర్షం వస్తే ఇబ్బందులే!**

గంగవరం గ్రామంలోని బీసీ కాలనీలో వర్షం కురిసిన సమయంలో నీటి ప్రవాహం కారణంగా ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను గుర్తించిన పల్లపాటి బాదరయ్య తన సొంత ఖర్చులతో తూముల ఏర్పాటు, మట్టి పనులు చేపట్టి సమస్య పరిష్కారానికి చొరవ చూపారు.ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ముందుకొచ్చి సొంత నిధులతో పనులు చేపట్టడంపై కాలనీవాసులు బాదరయ్యకి కృతజ్ఞతలు తెలిపారు. వర్షపు నీరు సజావుగా వెళ్లేందుకు ఈ పనులు ఉపయోగపడతాయని, తద్వారా రాకపోకలకు ఇబ్బందులు తగ్గుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.ప్రజా సమస్యల పరిష్కారంలో నాయకులు చొరవ చూపడం అవసరమని స్థానికులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పుల్లల చెరువు టీడీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కేశనపల్లి బక్కయ్య,ఆరా వెంకట్రావు, వెనిగండ్ల కోటేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల విద్యార్థులు పరిసరాల పరిశుభ్రతా కార్యక్రమం






**సి ఎస్ పురం, పెన్ పవర్ అక్టోబర్ 14**

సిఎస్ పురం కదిరి బాబురావు వ్యవసాయ కళాశాలకు చెందిన రావెప్ చివరి సంవత్సరం విద్యార్థులు శీలంవారిపల్లి గ్రామంలో గ్రామ పరిశు భ్రతా కార్యక్రమాన్ని నిర్వహించారు.బుధవారం ఎన్ ఎస్ ఎస్ ఇంచార్జి డాక్టర్ పీ స్టేఫీ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా పరిశుభ్రతను ప్రోత్సహించడానికి మరియు మెరుగైన పారిశుధ్య పరిస్థితులను పాటించేలా చేయడానికి, విద్యార్థులు గ్రామ పరిసరాలను శు భ్రపరచడంలో, ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి తొలగించడం, మరియు రహదారుల పక్కన, తేమగా ఉండే ప్రదేశాలలో బ్లీచింగ్ పౌడర్ చల్లడంలో చురుకుగా పాల్గొన్నారు. పర్యావరణ పరిశుభ్రత, వ్యర్థాలను సరిగ్గా పారవేయడం, మరియు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన గ్రామ వాతావరణాన్ని కాపాడుకోవడం యొక్క ప్రాముఖ్యత గురించి గ్రామస్తులలో అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమం లో అసోసియేట్ డీన్ డాక్టర్ కె.మోష,అధ్యాపక బృందం,గ్రామ ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు స్థానిక ఎన్నికల్లో పెద్దపిటా వేయడం గర్వకారణం



**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ అక్టోబర్ 14**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం, రాజకీయాల పరంగా స్థానిక ఎన్నికల్లో మహిళలను గౌరవిస్తూ మహిళలకు రిజర్వేషన్లు కల్పించడం మహిళ జాతికి గర్వకారణమని టీడీపీ నియోజకవర్గ మహిళ అధ్యక్షురాలు ముదిరాజ్ రమణమ్మ అన్నారు. బుధవారం నియోజకవర్గంలో ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలు మహిళలకు రిజర్వేషన్లు కేటాయించడంపై ఆమె హర్షించారు.గతంలో కూడా తెలుగుదేశం హయాంలో మహిళలకు రాజకీయ రిజర్వేషన్ కల్పించడమే కాకుండా, మహిళలకు ఆర్టీసీలో తొలిసారిగా ఉద్యోగా అవకాశాలు కల్పించిందని అన్నారు. మహిళలు లక్షాధికారులు కావాలని వెలుగు, డ్వాక్రా గ్రూపుల ద్వారా సమృద్ధిగా రుణాలు అందించి, స్వయం సంపాదన మార్గాన్ని అందించిందని అన్నారు. మహిళలు వంటింటికి పరిమితం కాకుండా రాజకీయ, చట్ట సభలకు రాణించేందుకు అవకాశం కల్పించడం మహిళ లోకన్ని గౌరవించడమేనని, నారా చంద్రబాబు నాయుడిని ప్రశంశించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం, మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు , తల్లికి వందనం,ఇచ్చిందని అన్నారు.త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో నియోజకవర్గ గూడూరి ఎరీక్షన్ బాబు నాయకత్వ ఆధ్వర్యంలోఆయన బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు.

# ఎన్నికల ప్రవర్తనా నియమావళిని అధికారులు తప్పక పాటించాలి

## – జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి సూచన



**ఒంగోలు కలెక్టరేట్, పెన్ పవర్ అక్టోబర్ 14**

జాయింట్ కలెక్టర్ కల్పన కుమారి వివిధ శాఖల అధికారులతో కలెక్టరేట్లోని జాయింట్ కలెక్టర్ ఛాంబర్ లో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. బుధవారం జరిగిన ప్రత్యేక సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆయా శాఖలు అందజేస్తున్న కార్యక్రమాలని అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని తూచా తప్పకుండా అమలు చేస్తూ శాఖ పరమైన కార్యక్రమాలను చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు, ఏడి మార్కెటింగ్ వరలక్ష్మి, ఐ సి డి ఎస్ పి డి పద్మ సునంద, మైన్స్ అండ్ జియాలజీ అధికారి రామచందర్, జిల్లా పరిశ్రమల అధికారి శ్రీనివాసరావు, డిఎం మార్క్ఫెడ్, పిడి హౌసింగ్ తదితర శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ఒంగోలులో ఘనంగా ముగిసిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ బాక్సింగ్ పోటీలు

## - మూడు విభాగాల్లో ఓవరాల్ ఛాంపియన్‌గా విశాఖపట్నం జిల్లా

## - 500 మంది క్రీడాకారుల ప్రతిభా ప్రదర్శన - జాతీయస్థాయి పోటీలకు విజేతలు

**ఒంగోలు కల్చరల్, పెన్ పవర్ అక్టోబర్ 14**

ప్రకాశం జిల్లా ఒంగోలులోని డాక్టర్ పి. ఆనంద్ మినీ స్టేడియంలో ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు నిర్వహించిన 70వ ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అంతర్ జిల్లా బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. అండర్–14 బాలురు, అండర్–17 బాలురు, బాలికల విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి సుమారు 500 మంది క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు.

మూడు రోజులపాటు హోరాహోరీగా సాగిన ఈ పోటీల్లో క్రీడాకారులు అద్భుతమైన ప్రతిభను ప్రదర్శించారు. వివిధ బరువుల విభాగాల్లో పోటీలు ఉత్కంఠభరితంగా సాగగా, విజేతలకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా పతకాలు అందజేశారు.

**జాతీయస్థాయి పోటీలకు విజేతలు**

ఈ పోటీల్లో అండర్–14 విభాగంలో బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు ఈ నెలలో ఢిల్లీలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయస్థాయి బాక్సింగ్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించనున్నారు. అదేవిధంగా అండర్–17 బాలురు, బాలికల విభాగాల్లో ఎంపికైన క్రీడాకారులు మణిపూర్ రాష్ట్రంలో నిర్వహించనున్న జాతీయస్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొననున్నారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు మరింత కష్టపడి సాధన చేసి జాతీయస్థాయిలో పతకాలు సాధించాలని స్కూల్ గేమ్స్ కార్యదర్శులు శివశంకర్, రాజ్యలక్ష్మి ఆకాంక్షించారు.



**విశాఖపట్నం జిల్లాకు ఓవరాల్ ఛాంపియన్‌షిప్**

మూడు విభాగాల్లో జరిగిన బాక్సింగ్ పోటీల్లో విశాఖపట్నం జిల్లా క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను సాధించారు. విజేతలకు పతకాలు అందజేయడంతో పాటు క్రీడాకారులను అభినందించారు. ఈ పోటీలకు ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ.వి. వెంకటేశ్వరరావు న్యాయనిర్ణేతగా వ్యవహరించగా, ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ అసోసియేషన్‌కు చెందిన రిఫరీలు, ఇతర సాంకేతిక అధికారులు పోటీల నిర్వహణలో పాల్గొన్నారు. నిబంధనలకు అనుగుణంగా పోటీలను విజయవంతంగా నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో వై. సీనయ్య, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) బాక్సింగ్ కోచ్ పాణ్యం వేణు, కే కృష్ణవేణి సోమినేని సురేష్, హాజిరా బేగం, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు క్రీడాకారులను అభినందించి, భవిష్యత్తులో జాతీయస్థాయిలోనూ మంచి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు, కోచ్‌లు, మేనేజర్లు, సాంకేతిక అధికారులు సమన్వయంతో వ్యవహరించడంతో పోటీలు విజయవంతంగా ముగిశాయి. క్రీడాకారుల్లో పోటీతత్వాన్ని పెంపొందించడంతో పాటు, జాతీయస్థాయికి ప్రతిభావంతులైన బాక్సర్లను ఎంపిక చేయడంలో ఈ ఛాంపియన్‌షిప్ కీలకంగా నిలిచింది.



# శ్రీ ముద్దసానమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి





**గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 14**

మార్కాపురం సమీపంలోని వెలిగొండ ప్రాజెక్టు వద్ద స్వయంభువుగా వెలసిన శ్రీ ముద్దసానమ్మ అమ్మవారి దేవస్థానంలో నిర్వహిస్తున్న దసరా నవరాత్రి మహోత్సవాల్లో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం నిర్వహించి, హోమగుండంలో నవధాన్యాలు సమర్పిస్తూ ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, వర్షాలు సమృద్ధిగా పడాలని, రైతులు, ప్రజలు సంతోషంగా ఉండాలని ప్రార్థించానన్నారు అనంతరం దేవస్థాన ప్రాంగణంలో ఎమ్మెల్యే అశోక్ రెడ్డి మొక్కను నాటారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ మొక్కలు నాటడం ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా స్వీకరించాలని ఈ కార్యక్రమం ద్వారా చాటిచెప్పారు. దసరా నవరాత్రి మహోత్సవాల సందర్భంగా ఆలయంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చివరగా దేవస్థానం , అర్చనలు, ఎమ్మెల్యే కు వేద మంత్రాలతో, అమ్మవారి ప్రతిమ ఇచ్చి శాలువ, పూలమలతో ఘనంగా సన్మానించారు.

# కారు ఢీకొని బైక్‌పై వెళ్తున్న వ్యక్తి మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు





**సంతమాగులూరు, పెన్ పవర్, అక్టోబర్ 14**

గుంటూరు––కర్నూలు రహదారిపై సంతమాగులూరు మండలం పాత మాగులూరు వద్ద బుధవారం సాయంత్రం కారు, రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. దొనకొండ మండలం కొచ్చర్లకోట గ్రామానికి చెందిన చింతగుంట్ల వెంకట ఆంజనేయులు (26), కాటే బాలుసోరి లు రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై వినుకొండ నుంచి నరసరావుపేట వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. పాత మాగులూరు వద్ద ఎదురుగా వస్తున్న కారు, ముందు వెళ్తున్న వాహనాన్ని అధిగమించే క్రమంలో బైక్‌ను ఢీకొట్టినట్లు తెలిసింది. ఈ ప్రమాదంలో వెంకట ఆంజనేయులు అక్కడికక్కడే మృతి చెందగా, బాలుసోరికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం నరసరావుపేట వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న సంతమాగులూరు నూతన ఎస్సై బాలకృష్ణ ప్రమాద స్థలాన్ని పరిశీలించి, ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేపట్టారు. సంతమాగులూరు సీఐ పి. శేషగిరిరావు సైతం ఘటనాస్థలిని సందర్శించి ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బాలకృష్ణ తెలిపారు.

# ఎన్నికలకు వేళయరా

**పొన్నలూరు పెన్ పవర్ అక్టోబర్ 14**

జడ్పిటిసి ఎంపీపీ ఎంపీటీసీ స్థానాల రిజర్వేషన్ ఖరారు కావాడంతో మండలంలో ఉద్రిక్తలు మొదలయ్యాయి. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి మండలంలో జడ్పిటిసి, ఎంపీపీ, ఎంపీటీసీ రిజర్వేషన్లు బుధవారం ఖరార్ అయ్యాయి, మండలంలో 12 ఎంపీటీసీ స్థానాలకు కేటగిరిల వారీగా కేటాయింపులు చేశారు. వీటిలో ఎస్సీలకు 3, బీసీలకు 3, జనరల్ కేటగిరీకి ఆరు స్థానాలు కేటాయించారు. సింగరభట్లపాలెం, విప్పగుంట ఎంపీటీసీ స్థానాలకు ఎస్సీ జనరల్, వెల్లటూరుకు ఎస్సీ మహిళ కేటాయించారు, మాలపాడు బీసీ జనరల్లకు కేటాయించారు, చెరుకూరు, పొన్నలూరు కు బీసీ మహిళలకు రిజర్వ్ చేశారు. చెన్నిపాడు, భోగనంపాడు, రావులకొల్లు జనరల్ కేటగిరి, తిమ్మపాలెం చౌటపాలెం కోటపాడు స్థానాలు మహిళలకు కేటాయించారు. పొన్నలూరు జడ్పిటిసి స్థానాన్ని ఎస్సీ మహిళకు, ఎంపీపీ స్థానాన్ని జనాల మహిళలకు కేటాయించారు. రిజర్వేషన్లు ఖరారావడంతో రాజకీయ సమీకరణాలపై గ్రామాల్లో చర్చలు మొదలయ్యాయి.

# కూటమి ప్రభుత్వంలో నూకవరం అభివృద్ధి





**వలేటివారిపాలెం, పెన్ పవర్ అక్టోబర్ 14**

గత వైకాపా ప్రభుత్వ హయాంలో అభివృద్ధికి నోచుకోని నూకవరం గ్రామానికి, కూటమి ప్రభుత్వంలో మంచి రోజులు వచ్చాయని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. రెండేళ్ల కాలంలో సుమారు కోటి రూపాయలకు పైగా అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. నూకవరం గ్రామంలో 14.5 లక్షలతో నిర్మించిన డ్రైనేజీ కాలువలు, 10 లక్షలతో నిర్మించిన సిసి రోడ్లు, 13.30 లక్షలతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాన్ని ఎమ్మెల్యే బుధవారం ఉదయం ప్రారంభించారు. అనంతరం మొక్కలు నాటారు. గ్రామ పరిధిలోని రెండు చిన్న చెరువులను పటిష్టం చేసేందుకు 10 లక్షలు ఖర్చు చేశామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావు చెప్పారు. అలాగే 60 లక్షల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు జరిపించామన్నారు. అర్హులైన వారందరికీ తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ ఇలాంటి సంక్షేమ పథకాలను అందించామని ఎమ్మెల్యే నాగేశ్వరరావు గుర్తు చేశారు. నూకవరం గ్రామాన్ని సొంత ఊరిలాగా భావించి, అభివృద్ధిలో పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే తెలియజేశారు. ఈకార్యక్రమంలో తహసిల్దార్ లావణ్య, మండల టిడిపి అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, గ్రామ పార్టీ అధ్యక్షుడు దాచర్ల శ్రీను, మండల తెలుగు యువత అధ్యక్షుడు బద్దిపూడి శిఖామణి, మాజీ సర్పంచ్ ఇంటూరి యలమంద, స్థానిక నేతలు ఇంటూరి కోటేశ్వరరావు, ఇంటూరి రవి, దాచర్ల వెంకటరావు, బద్దిపూడి చెంచయ్య, అబ్రహం, ఆనందరావు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

# శాకాంబరీ దేవి శరణు శరణు

**దొనకొండ అక్టోబర్ 14 పెన్ పవర్**

మండల కేంద్రంలోని విరాట్ నగర్ లో గల శ్రీ ఆనంద ఆశ్రమంలో దసరా మహోత్సవంలో భాగంగా ఆనంద ఆశ్రమంలో నాలుగవ రోజు శాకాంబరి దేవిగా శ్రీ ఈశ్వరి మహాదేవి దర్శనమిచ్చారు ఉదయం 6 గంటల నుండి అమ్మవారికి విశేషఅభిషేకాలు ప్రత్యేక అలంకరణ చేసి అమ్మవారికి అష్టోత్తర శతనామావళి సహస్రనామార్చన సామూహిక కుంకుమ పూజ నిర్వహించి పులిహోర పొంగలి దద్దోజనం విశేష నైవేద్యాలు సమర్పించి మహిళలచే సామూహిక హారతులు ఇచ్చారు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొంనారు వచ్చిన భక్తులకు ఆశ్రమ అర్చకులు మణి బాబు శర్మ తీర్థ ప్రసాదములు అంద చేశారు ఉభయ దాతలు దొనకొండ గుట్టమీద పల్లి వాస్తవ్యులు తాండవ లక్ష్మయ్య రంగలక్ష్మి దంపతులు వచ్చిన భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు ఐదవ రోజు కాశి అన్నపూర్ణేశ్వరిగా శ్రీ ఈశ్వరీమహాదేవి దర్శనమిస్తుందని శ్రీ భైరవానంద స్వామి తెలియజేశారు.



# యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

## క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన ఎస్సై వెంకటేశ్వర్‌రెడ్డి





**సి.ఎస్.పురం, పెన్ పవర్, అక్టోబర్ 14**

దసరా ఉత్సవాలను పురస్కరించుకొని మండల కేంద్రం సి.ఎస్.పురం లోని డి.జి.పేట రోడ్డులో గల క్రీడా మైదానం నందు బుధవారం క్రికెట్ టోర్నమెంట్ ను నిర్వాహకుల ఆహ్వానం మేరకు స్థానిక ఎస్సై పి. వెంకటేశ్వరరెడ్డి, మండల టిడిపి అధ్యక్షుడు బొబ్బూరి రమేష్ రిబ్బన్ కట్ చేసి పోటీలను ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని వారికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్సై వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ఇటువంటి టోర్నమెంట్ లు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. క్రీడలు శారీరక ఆరోగ్యాన్ని పెంపొందించడంతో పాటు మానసిక దృఢత్వం, క్రమశిక్షణ, పట్టుదలను అలవర్చుతాయని అన్నారు యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు.క్రీడల్లో గెలుపోటములు సహజమని, ఓటమి ఎదురైనప్పుడు నిరుత్సాహపడకుండా దానిని విజయానికి పునాదిగా మలుచుకోవాలని క్రీడాకారులకు సూచించారు. క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొంటూ తమ ప్రతిభను చాటుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు బొబ్బూరి రమేష్, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి సభ్యులు డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు, సింగిల్ విండో చైర్మన్ చెరుకుపల్లి వెంకటరెడ్డి టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి నాగిశెట్టి చిన్న మాలకొండయ్య, టిడిపి సీనియర్ నాయకులు మన్నేపల్లి శ్రీనివాసులు, లాయర్ శ్రీను, కోనంగి వెంకట కొండయ్య, మైనార్టీ సెల్ అధ్యక్షులు కూటగుళ్ల మహబూబ్ బాషా, పునుగుపాటి రవికుమార్, అట్లూరి రామకృష్ణంరాజు, గుంటి మడుగు వెంకట రామరాజు, ఇండ్ల శ్రీనివాసులు, బలబద్ర రవి, కోటగిరి శ్రీనివాసులు, కుక్కా తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

# శ్రీగిరిలో 18 నుండి శరన్నవరాత్రి విశేష కార్యక్రమాలు

## - శ్రీ గిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి వెల్లడి





**ఒంగోలు కల్చరల్, పెన్ పవర్ అక్టోబర్ 14**

ఒంగోలులోని కుర్తాళం శ్రీ సిద్దేశ్వరి పీఠ పాలిత శ్రీగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈ నెల 18 నుండి 20వ తేదీ వరకు విశేష కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్ పర్సన్ ఆలూరు ఝాన్సీ రాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలా దేవి, కార్య నిర్వహణ ధర్మకర్త సి వి రామకృష్ణారావు, ధర్మకర్తల మండలి ప్రతినిధులు వెల్లడించారు. 18 వ తేదీ ఆదివారం శ్రీవారికి తోమాల సేవ, తులసి దళాలతో సహస్రనామార్చన, సాయంత్రం ఏడు గంటలకు హనుమంతు వాహన సేవ , తెనాలికి చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకులు విశ్రాంత తెలుగు అధ్యాపకులు రాయప్రోలు జగదీశ చంద్రశర్మచే ఆధ్యాత్మిక ఉపన్యాసం జరుగుతాయి. 19వ తేదీ సోమవారం సాయంత్రం ఏడు గంటలకు శ్రీవారికి ఊంజల సేవ .. శ్రీ గిరి దేవస్థానం ఆస్థాన సంగీత విద్వాంసులు వి వి ఎస్ వినోద్ కుమార్ చే భక్తి సంగీత విభావరి జరుగుతాయి. 20 వ తేదీ మంగళవారం సాయంత్రం 6:30 గంటలకు శ్రీవారి తిరు వీధి ఉత్సవం.. ద్వారకాపాడుకు చెందిన శ్రీ శ్రీనివాస మహిళా భజన సమాజం వారిచే కోలాట ప్రదర్శన జరుగుతాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులు కోరారు.

# సంతమాగులూరు నూతన ఎస్సైగా ఏ బాలకృష్ణ

**సంతమాగులూరు, పెన్ పవర్, అక్టోబర్ 14**

సంతమాగులూరు నూతన ఎస్సైగా ఏ బాలకృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గత రెండు నెలలుగా సంతమాగులూరు పోలీస్ స్టేషన్లో ఎస్సై లేకపోవడం ఎస్సై ఇన్చార్జిగా సీఐ శేషగిరిరావు బాధ్యతలు నిర్వహించారు. ఈ క్రమంలో కందుకూరు పోలీస్ స్టేషన్ లో పనిచేస్తున్న ఏ బాలకృష్ణను బదిలీపై సంతమాగులూరు పోలీస్ స్టేషన్ కు మార్చడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సై బాలకృష్ణ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు, శాంతిభద్రలపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఎస్సై ఎ బాలక్రిష్ణ తెలిపారు.



## ఉప్పల్‌లో టీమిండియా ఓటమి.. 2-2తో

# సిరీస్ సమం చేసిన విండీస్



హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం (ఉప్పల్) వేదికగా జరిగిన నాలుగో టీ20 మ్యాచ్‌లో వెస్టిండీస్ బౌలర్ల దెబ్బకు భారత జట్టు ఘోరంగా ఓడిపోయింది. విండీస్ నిర్దేశించిన 248 పరుగుల లక్ష్య ఛేదనలో టీమిండియా తడబడి, 24 పరుగుల తేడాతో పరాజయం చవిచూసింది. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను వెస్టిండీస్ 2-2 తేడాతో సమం చేసింది. ఈ ఉత్కంఠభరిత పోరులో కీమో పాల్ ఐదు వికెట్లతో చెలరేగి భారత్ విజయానికి గండికొట్టగా, మ్యాచ్ మధ్యలో పేసర్ అర్షదీప్ సింగ్ గాయంతో రిటైర్డ్ హర్ట్ కావడంతో 19.3 ఓవర్లలోనే టీమిండియా ఆలౌట్ అయింది.

**కీమో పాల్ వీరవిహారం:**

248 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత జట్టుకు ఓపెనర్లు మంచి ఆరంభమే ఇచ్చినా, మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. ముఖ్యంగా వెస్టిండీస్ బౌలర్ కీమో పాల్ టీమిండియా ఇన్నింగ్స్‌ను శాసించాడు. ఒకే ఓవర్లో నితీష్ కుమార్ రెడ్డి (41 పరుగులు), ప్రిన్స్ యాదవ్ (గోల్డెన్ డక్), అక్షర్ పటేల్ (3 పరుగులు)లను పెవిలియన్‌కు పంపి మ్యాచ్ స్వరూపాన్ని పూర్తిగా మార్చేశాడు. ఈ మ్యాచ్‌లో మొత్తం 5 వికెట్లు పడగొట్టి ఇండియా విజయావకాశాలను దెబ్బతీశాడు. ఆయనతో పాటు గుడకేష్ మోటీ 2 వికెట్లు తీసుకోగా, షామర్ స్ప్రింగర్, రొమారియ షెఫర్డ్ తలో వికెట్ తీసుకుని భారత్‌ను కోలుకోలేని దెబ్బతీశారు.

**పోరాడి ఓడిన భారత బ్యాటర్లు:**

భారత జట్టు తరపున సంజు శాంసన్, తెలుగు కుర్రాళ్లు తిలక్ వర్మ (43), నితీష్ కుమార్ రెడ్డి (41), అభిషేక్ శర్మ (29) పోరాడినప్పటికీ 248 పరుగుల లక్ష్యాన్ని మాత్రం చేరుకోలేకపోయారు. ముఖ్యంగా కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (16), ఇషాన్ కిషన్ (6), నమన్ ధీర్ (0), అక్షర్ పటేల్ (3) బ్యాటింగ్‌లో పూర్తిగా విఫలమయ్యారు.

దీనికి తోడు పేసర్ అర్షదీప్ సింగ్ గాయం కారణంగా రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరగడం జట్టు 223 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో 24 పరుగుల తేడాతో ఇండియా ఓడిపోయింది. ఇక ఐదో టీ20 మ్యాచ్ బెంగళూరు వేదికగా అక్టోబర్ 17వ తేదీన జరగనుంది.

# ఐసీసీ ర్యాంకింగ్స్‌లో భారత బ్యాటర్ల హవా..

# శ్రేయస్ అయ్యర్‌కు కెరీర్ బెస్ట్ ర్యాంక్!

- టీ20 ర్యాంకింగ్స్‌లో నాలుగో స్థానానికి దూసుకెళ్లిన శ్రేయస్
- తొలి టీ20 సెంచరీతో కెరీర్లోనే అత్యుత్తమ ర్యాంక్ సాధించిన వైనం
- టాప్-4లో ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ, అయ్యర్‌తో ముగ్గురు భారతీయులు
- టెస్టుల్లో నంబర్ వన్ ఆల్‌రౌండర్‌గా రవీంద్ర జడేజా స్థానం పదిలం
- ఆసీస్, పాక్, దక్షిణాఫ్రికా ఆటగాళ్ల ర్యాంకుల్లోనూ కీలక మార్పులు



భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో తన కెరీర్‌లోనే అత్యుత్తమ ర్యాంకును అందుకున్నాడు. వెస్టిండీస్‌తో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో అద్భుత ప్రదర్శన చేసిన అయ్యర్, మూడు స్థానాలు ఎగబాకి నాలుగో ర్యాంకును కైవసం చేసుకున్నాడు. లక్నో వేదికగా జరిగిన సిరీస్‌లోని తొలి మ్యాచ్‌లో తన తొలి టీ20 అంతర్జాతీయ శతకాన్ని నమోదు చేయడం అతడి ర్యాంకు భారీగా పెరగడానికి కారణమైంది.అయ్యర్ రాకతో టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో టాప్-4లో ముగ్గురు భారత ఆటగాళ్లు చోటు దక్కించుకోవడం విశేషం. ఇషాన్ కిషన్ అగ్రస్థానంలో కొనసాగుతుండగా, అభిషేక్ శర్మ రెండో స్థానంలో ఉన్నాడు. పాకిస్థాన్ కెప్టెన్ సాహిబ్జాదా ఫర్హాన్ మూడో స్థానంలో నిలిచాడు. ఇదే సిరీస్‌లో రాణించిన మరో భారత ఆటగాడు సంజూ శామ్సన్ కూడా నాలుగు స్థానాలు మెరుగుపరుచుకుని 27వ ర్యాంకుకు చేరుకున్నాడు.

ఇక బౌలింగ్ విషయానికి వస్తే.. భారత్‌తో సిరీస్‌లో రాణించిన వెస్టిండీస్ ఆటగాడు రోస్టన్ చేజ్ 24 స్థానాలు ఎగబాకి 23వ ర్యాంకులో నిలిచాడు. ఆల్‌రౌండర్ల జాబితాలోనూ రెండు స్థానాలు మెరుగుపరుచుకుని మూడో స్థానానికి చేరుకున్నాడు. పాకిస్థాన్ బౌలర్ సల్మాన్ మీర్జా 14వ స్థానానికి, సయీం అయూబ్ 54వ స్థానానికి మెరుగుపడ్డారు.

**టెస్టుల్లోనూ కీలక మార్పులు**

దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టు మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 214 పరుగుల తేడాతో విజయం సాధించడంతో టెస్టు ర్యాంకింగ్స్‌లోనూ పలు మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ మ్యాచ్‌లో 190, 82 పరుగులతో అద్భుత ప్రదర్శన చేసి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచిన ఆస్ట్రేలియా బ్యాటర్ మాథ్యూ రెన్షా, ఏకంగా టాప్-100 బయట నుంచి 49వ ర్యాంకుకు దూసుకొచ్చాడు. ఆసీస్ బౌలర్ జోష్ హేజిల్‌వుడ్ కెరీర్ బెస్ట్ గణాంకాలతో (6/49) రెండు స్థానాలు మెరుగుపరుచుకుని ఏడో ర్యాంకుకు చేరుకున్నాడు. మిచెల్ స్టార్క్ అగ్రస్థానంలోనే కొనసాగుతున్నాడు.భారత స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా టెస్టు ఆల్‌రౌండర్ల జాబితాలో తన నంబర్ వన్ స్థానాన్ని పదిలంగా ఉంచుకున్నాడు. మరోవైపు, ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్ మధ్య జరిగిన టెస్టులో రాణించిన రహ్మత్ షా 13వ ర్యాంకుకు, లిటన్ దాస్ 29వ ర్యాంకుకు చేరుకున్నారు.

# అభిషేక్ శర్మ రికార్డు బద్దలు కొట్టిన పాక్ కెప్టెన్ ఫర్హాన్!



పాకిస్థాన్ కెప్టెన్ సాహిబ్జాదా ఫర్హాన్ టీ20 క్రికెట్‌లో ప్రపంచ రికార్డు సృష్టించాడు. శ్రీలంకతో జరిగిన మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 238 పరుగులు సాధించి, భారత ఆటగాడు అభిషేక్ శర్మ నెలకొల్పిన 229 పరుగుల రికార్డును అధిగమించాడు. ఫర్హాన్ చివరి మ్యాచ్‌లోనూ 76 పరుగులతో రాణించాడు.అయితే, ఈ మ్యాచ్‌లో శ్రీలంక 8 వికెట్ల తేడాతో పాకిస్థాన్‌పై విజయం సాధించింది. కుశాల్ మెండిస్ 87 పరుగులతో జట్టు గెలుపులో కీలక పాత్ర పోషించాడు. అయినప్పటికీ పాకిస్థాన్ తొలి రెండు మ్యాచ్‌ల్లో గెలవడంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-1తో కైవసం చేసుకుంది.

# ఫ్లాప్ హీరోపై మళ్లీ 'వందల కోట్లు' నమ్మకం..!



తెల్లని లేస్ కార్సెట్ టాప్ మరియు డెనిమ్ షార్ట్స్‌లో యాషికా ఆనంద్ మెరుపులు



కేజీఎఫ్‌తో పాన్ ఇండియా స్టార్‌గా మారిన యశ్ ఇటీవల 'టాక్సిక్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చి తీవ్రంగా నిరాశ పరిచిన విషయం తెల్సిందే. కన్నడ ప్రేక్షకులు మినహా టాక్సిక్ సినిమాను మరే భాష ప్రేక్షకులు చూసేందుకు ఆసక్తి చూపించలేదు. అంతే కాకుండా యశ్ పై తీవ్ర విమర్శలు వచ్చాయి. దాదాపు రెండేళ్లు వెయిట్ చేసి నువ్వు ఎంపిక చేసుకున్న స్క్రిప్ట్ ఇదా అంటూ యశ్ ను ఓ రేంజ్‌లో ట్రోల్స్ చేశారు. అంతే కాకుండా దర్శకురాలును కాదని యశ్ సినిమాను తీసినట్లుగా అనిపించిందనే విమర్శలు సైతం వచ్చాయి. కేజీఎఫ్ సినిమా కేవలం ప్రశాంత్ నీల్ వల్ల హిట్ అయింది, కనుక యశ్ మళ్లీ ఆ రేంజ్ సినిమాల కోసం ప్రయత్నాలు చేయక పోవడం మంచిదని కొందరు సలహా ఇచ్చారు. కాస్త కిందికి దిగి యశ్ సినిమాలు చేస్తే బెటర్ అని, లేదంటే కెరీర్ చిక్కుల్లో పడే అవకాశాలు ఉన్నాయంటూ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

**యశ్ టాక్సిక్ మూవీ తర్వాత...**

టాక్సిక్ సినిమా ఫలితం తర్వాత కూడా యశ్ మళ్లీ అదే స్థాయి సినిమాను చేయాలని, మళ్లీ కేజీఎఫ్ రేంజ్ హిట్ కొట్టాలని ఆశ పడుతున్నాడు. అందుకోసం స్క్రిప్ట్‌ను చూస్తున్నాడు, ఆ రేంజ్‌లో సినిమాను తీసే వారిని, ఆ స్థాయిలో బడ్జెట్ ఖర్చు చేసే వారిని యశ్ చూస్తున్నట్లు కన్నడ మీడియాలో కథనాలు వస్తున్నాయి. ఫైనల్‌గా యశ్ తో పీఎస్ మిత్రన్ ఒక భారీ సినిమాను చేసేందుకు రెడీ అయ్యాడు. ఆ మధ్య ధనుష్ తో మిత్రన్ అనుకున్న సినిమాను కొన్ని కారణాల వల్ల యశ్ తో చేసేందుకు సంజయ్ లీలా భన్సాలీ రెడీ అయ్యాడని వార్తలు వస్తున్న విషయం తెల్సిందే. అయితే భారీ ఫారెస్ట్ అడ్వెంచర్ మూవీ కావడంతో సినిమాకు వందల కోట్ల బడ్జెట్ ఖర్చు అవుతుందని అంటున్నారు. యశ్ పై ఆ స్థాయిలో ఖర్చు పెట్టడం ఎంత వరకు కరెక్ట్ అంటూ కొందరు ఈ సందర్భంగా ప్రశ్నిస్తున్నారు. యశ్ పై బలమైన కంటెంట్ ఉంటే తప్ప ఖర్చు పెట్టకూడదని విశ్లేషకులు అంటున్నారు.

**సంజయ్ లీలా భన్సాలీ నిర్మాణంలో...**

సంజయ్ లీలా భన్సాలీ ఈ సినిమాను నిర్మించేందుకు రెడీగా ఉన్నాడు. అయితే యశ్ ను సైతం నిర్మాణ భాగస్వామిగా చేర్చే అంశమై పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. పీఎస్ మిత్రన్ హాలీవుడ్ మూవీ ఇండియానా జోన్స్ రేంజ్‌లో ఒక స్క్రిప్ట్ ను రెడీ చేశాడట. విదేశాల్లో ఎక్కువగా షూట్ ఉంటుందని అంటున్నారు. కనుక ఈ సినిమా కచ్చితంగా భారీ బడ్జెట్ మూవీగా నిలిచే అవకాశాలు ఉన్నాయి. పీఎస్ మిత్రన్ గత చిత్రాల ఫలితాలను చూస్తే ఇప్పుడు ఇలాంటి మూవీ అవసరమా అనే అభిప్రాయం కలుగక మానదు. మిత్రన్, యశ్ కాంబో అంటే కనీసం బజ్ క్రియేట్ అయ్యే పరిస్థితి లేదు. సినిమా మొదలు అయితే ఏమైనా మ్యాజిక్ జరిగి బజ్ క్రియేట్ అవుతుందా అనేది చూడాలి. సాధారణంగా ఒక సినిమా గురించి చిన్న పుకారు వచ్చినా సోషల్ మీడియాలో ఆహా... ఓహో అనే రేంజ్ లో ప్రచారం జరుగుతుంది. కానీ ఈ సినిమా గురించి పెద్దగా పట్టించుకునే వారే లేరు.



దిశా పటాని గ్లామరస్ లుక్: వైరల్ అవుతున్న లేటెస్ట్ మిర్రర్ సెల్ఫీ

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com